# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**



ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 8
పేజీలు 40
ఏప్రియల్ 2015

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ..................... పేజీ**


భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ................................3
అమ్మమాట..............................................5
ఆపద్బాంధవుడు ..................................7
సౌందర్యం!? ........................................9
సన్నిధిలో సంభాషణ ...........................11
యోగవాశిష్ఠము ..................................13
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................15
పరిప్రశ్నేన సేవయా..............................16
గురువంటే తెలుసుకో! ........................ 17
గీతాధ్యయనమ్....................................18
శ్రీకృష్ణకర్ణామృతము............................20
చైత్ర వైశాఖాల విశిష్ఠత .......................22
శ్రీబాబు దివ్యవాణి ..............................24
కల్పవృక్షం నీడలో ఉంటే .....................25
సద్గురు శ్రీయాత్రా దర్శన్......................27
నరహరి సోనార్ ...................................29
మొదట మీ హృదయాన్ని పవిత్రం చేసుకోండి!.................31
ఇంద్రద్యుమ్నుడు ...................................33
సత్సంగామృతం....................................34
హనుమద్వైభవము.................................36
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర..........37
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।
తేన త్యక్తేన భుఞ్జీదా మాగృధః కస్యస్విద్ధనమ్ ॥
(ఈశావాశ్యోపనిషత్ - 1)

ఈ జగత్తు యొక్క ధ్యేయమునందు ఈశ్వర తత్త్వము వ్యాప్తమై ఉంది. కనుక జగద్భావమును విడిచి, జగత్తుకు ధ్యేయమైన ఈశ్వర తత్త్వం కోసం నీ సాధన కూడా ధ్యేయమైన ఆత్మతత్త్వాన్ని అనుభవిస్తూ జగత్తు సత్యమనే భావాన్ని విడనాడి, ఎన్నడూ జగద్విషయము నందు అభిమానం, కోరిక ఉండకూడదని ఈ శ్లోకము హెచ్చరిస్తోంది.

జగత్తు పుట్టినందువలన మార్పులు చెందక, నశింపక తప్పదు. కాబట్టి జగత్తును ఆశ్రయించి శాశ్వత సుఖాన్ని, ఆనందాన్ని పొందాలి అనుకోవటం వివేకవంతం కాదు. ఎందుకంటే కాకర విత్తనాలు కాకర కాయలనే అందిస్తాయి కాని, మనం కోరుకునే ఇతర ఫలాలను అందించ లేవు కదా!

అశాశ్వతమైన జగత్తు ద్వారా శాశ్వతమైన సుఖాన్ని ఆశించటం ఎంతవరకు సమంజసం? లోకంలో భౌతికంగా గోచరించేవన్నీ వ్యావహారికంగా భిన్నంగా ఉంటున్నాయి. ఒక వ్యక్తి తెల్లగా, అందంగా గోచరించినా, అతని గుణం మంచిది కాకపోవచ్చు.

కాబట్టి సాధకులంతా భౌతిక, వ్యావహారిక వాస్తవికతలను ప్రక్కన పెట్టి, ఈశ్వర వాస్తవికత కోసం అన్వేషణ సాగించి, దానిని పొంది, అనుభవించినప్పుడే ఆనందాన్ని పొందుతారు. అప్పుడే జీవిత ధ్యేయం నెరవేరుతుంది. సాధకులందరి సాధన, బాధ్యత ఈ దిశలో కొనసాగాలని కోరనివారు ఎవరుంటారు? అదే ఉపనిషత్తు హెచ్చరిస్తోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "సాధన ఫలించాలంటే సాధకునికి వైరాగ్యం అవశ్యం. వైరాగ్యము అంటే భార్యా బిడ్డలను, సంసారాన్ని వదిలిపెట్టడం కాదు. భగవంతుడు నీకిచ్చిన శక్తిమేరకు నిర్వహించవల్సిన విధులను త్యాగం చేయడం అంతకన్నా కాదు. వైరాగ్యము అంటే దేనిని ద్వేషించడమూ కాదు. అసహ్యించు కొనడమూ కాదు. శ్రీ శంకరభగవత్పాదుల వారు వైరాగ్యమును గురించి వివరిస్తూ 'చిక్కని పాలతోను, జీడిపప్పు, కిస్మిస్ ఇంకా ఇతర సుగంధ ద్రవ్యాలను వేసి తయారు చేసిన పాయసాన్ని స్వీకరించిన తరువాత వమనం చేసుకున్నామనుకో



దానిని తిరిగి స్వీకరించగలవా? నువ్వు వమనం చేసుకున్న పాయసమే కదా! దానిని చూసి నీకు ఎంతటి విముఖత కలుగుతుందో, ప్రాపంచిక విషయాలయందు అంతటి విముఖత కలిగినపుడే అది వైరాగ్యం అనిపించుకుంటుంది' అన్నారు.

గృహస్థాశ్రమం సాధకునికి వైరాగ్యాన్ని సాధించడానికి చాలా అనుకూలమైనది అన్నారు. ఇంకా మాట్లాడుతూ గృహస్థుగా పొందిన అనుభవాలను విచారణ చేసి అవశ్యముకాని విషయాదులను తొలగించుకొనడానికి అవకాశము ఉంటుంది. ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. నాతో ఎంతో సన్నిహితంగా ఉండే ఒక సాధకుని మంచి మార్గంలో నడిపించడానికి అతను ఎంతగానో ప్రేమించే చుట్టకాల్చే వ్యసనాన్ని త్యాగం చేసి నాకు సమర్పించమన్నాను. కానీ, ఆ సాధకుడు లౌక్యంగా తప్పించుకున్నాడు. ఇటువంటి సాధకులు వైరాగ్యాన్ని ఎలా సాధించగల్గుతారు? నువ్వు ఆశ్రయించిన సద్గురుమూర్తి నీ భోగభాగ్యాలు గానీ, ధనాన్నిగానీ, వస్త్రాలు గాని కోరలేదు. ఆయన నీ వ్యసనాలలో ఒక దానిని త్యాగం చేయమన్నారు. ఒక్క సంకల్పాన్ని త్యాగం చేయలేని సాధకుడు ఇంక వైరాగ్యాన్ని ఎలా సాధించగల్గుతాడు? సాధకుడు నిత్యానిత్య వస్తు వివేకము కలిగి ఆత్మ వస్తువును దర్శించాలనే ఆవేదన

ఆరూఢమైనపుడే ఇహపరలోక సౌఖ్యములయందు అనాసక్తి కలుగుతుంది. సద్గురుమూర్తి బోధాశ్రవణము, వివేకవంతమైన విచారణ ద్వారా మనస్సు, వాక్కు, ఇంద్రియాలు అశాశ్వతమైనవి అని. వీటిద్వారా తాను పొందే ఆనందము అశాశ్వతమైనది అని గుర్తించగలగడమే నిజమైన వైరాగ్యము. ఒక వస్తువు యొక్క విలువను గుర్తించినపుడు దానిని పొందడానికి మానవుడు తప్పక త్యాగం చేయడానికి సిద్ధపడతాడు. త్యాగం చేస్తేనే వైరాగ్యం సిద్ధిస్తుంది. ఏ సంకల్పము లేనివాడు విరాగి, ఇహలోక సౌఖ్యాలయందు పరలోక సౌఖ్యాలయందు ఆసక్తి లేకుండా త్రిగుణములను, రాగద్వేషాలను, అహంకార మమకారాలనూ ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనితనములను త్యాగముచేసి, ఆత్మ వస్తువును దర్శించాలనే ఆసక్తి పెంపొందినపుడే అది వైరాగ్యము అనిపించుకుంటుంది.

భగవంతుని దర్శించాలనే ఆసక్తి ప్రేమగా మారి భక్తిభావము కలుగుతుంది. ప్రేమ తన సుఖాన్ని త్యాగం చేసి ఇతరులకు సుఖాన్ని అందిస్తుంది. త్యాగంతో కూడిన ప్రేమ భక్తి అని పిలువబడుతుంది. అటువంటి భక్తుడు వైరాగ్యము సాధించ గల్గుతాడు. భక్తి, వైరాగ్యము పటిష్ఠముగా ఉన్న సాధకుడు తన గమ్యస్థానాన్ని చేరగల్గుతాడు. ఒక పక్షి రెండు రెక్కలు బలిష్ఠముగా ఉన్న ఎడల చక్కగా ఎగిరి ఒక చెట్టు యొక్క శిఖరాగ్రమున ఉన్న ఫలాన్ని అందుకున్నట్లు సాధకుడు భక్తి వైరాగ్యాల సహాయంతో మోక్షఫలాన్ని అందుకోగల్గుతాడు.

ఎవరైనా మృతిచెందిన వ్యక్తి దహన సంస్కారక్రియలను దర్శించిన సాధకుడు మనస్సులో తాత్కాలికముగా చెందే వ్యధ వైరాగ్యము అనిపించకోదు. అది తాత్కాలికమైనదే. కొలది గంటలు గడచిన తరువాత తాను దర్శించినవన్నీ మరచిపోయేవే. అదే మాయా శక్తి ప్రభావం, దీనినే శ్మశాన వైరాగ్యం అంటారు. ఇటువంటి కోవకే చెందినవి ప్రసూతి వైరాగ్యము, పురాణ వైరాగ్యము. కాబట్టి సాధకుడు తాను ఆశ్రయించిన సద్గురుమూర్తి చేసే బోధను శ్రవణం చేసి వివేకవంతుడై విచారణ ద్వారా మననం చేసినట్లైతే అది నిధిధ్యాసకు వచ్చి నిజమైన వైరాగ్యభావనను పెంపొందిస్తుంది" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## మనస్సుని మథించి మన్మథుణ్ణి జయించండి

మనం శ్రీగురుదేవులు ప్రసాదించినటువంటి లక్ష్యార్థ సాధన అనే ధ్యాన ప్రక్రియలో ప్రయాణం చేస్తున్నాం. కదలికలకు అలవాటు పడిన మనకు ధ్యానప్రక్రియతోబాటు సంకీర్తన, సత్సంగం, పూజ అనే ఇతర సేవలను కూడా ప్రసాదిస్తూ శ్రీగురుదేవులు మనలోని కదలికలను చక్క బరచి, ఏకత్వదృష్టికి రావడానికి తమ అనుగ్రహ వర్షాన్ని కురిపిస్తున్నారు.

క్రొత్తసంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. గత సంవత్సరంలో మనమెంత సాధన చేశాము? మనలో ఎంత మార్పు వచ్చింది? లక్ష్యార్థ సాధనలో మనం ఎదుర్కొన్న అడ్డంకులు ఏవి? వాటిని ఎలా అధిగమించాం? ఇంకా మనం ఎంత శ్రమించాలి? అని సింహావలోకనం చేసుకోవడానికే నేమో మనకి మౌన ధ్యాన సప్తాహాన్నిచ్చారు శ్రీగురుదేవులు!

మానసిక కదలికలే నీ అశాంతికి మూలం. 'అయ్యో! ఏదో ఆలోచిస్తూ ఇలా చేశానే!" అని చేశాక బాధపడతాం. చేసే పని యందు మనస్సు పెట్టక దెబ్బతింటున్నాం. ఇంతకుముందు శ్రీగురుదేవులు పూజను ప్రసాదించారు. అది బాహ్యపూజ. ఇక్కడ ధ్యానంలో మనం చేస్తున్నది మానసిక పూజ. మనలో నుండి వస్తున్న సద్భావనలతో మనం మానసికపూజ చేస్తున్నాం. 'ప్రశాంతులు ఎవరు?' అంటే మనకి అమృతనాదోపనిషత్ ఈ విధంగా చెబుతోంది................

అంధవత్ పశ్యరూపాణి । శబ్దం బధిరవత్ శృణు ।
కాష్ఠవత్ పశ్యవై దేహం । ప్రశాంతస్యేతి లక్షణమ్ ॥

మనస్సు చేసే కదలికలే నీ అశాంతికి మూలం అని తెలిసింది కదా! సరే నీ కళ్ళు చూస్తున్నాయా? చూడనీ, కానీ గ్రుడ్డివాడిలాగ చూడు. ఏది చూసినా భగవత్పరంగా చూడు. లేకపోతే గ్రుడ్డివాడుగా అయిపో. అంటే ఏది చూసినా నీ మనస్సులో దాని ముద్ర పడకూడదు. శబ్దాలని ఒక చెవిటివాడిలాగ వినాలి. నీ దేహాన్ని ఒక కట్టెను చూసినట్లు చూడు. అప్పుడు నీ మనస్సుకి ఎప్పుడూ ప్రశాంతతే.

ప్రహ్లాదుని ప్రశాంతతకి కారణం ఎవరు? తన గురుదేవుడైన

నారదుడు చేసిన బోధే. తన తల్లి కడుపులో ఉన్నప్పుడే గురుబోధని చక్కగా ఆకళింపుచేసుకున్నాడు. 'చేసేది, చేయించేదీ కూడా నువ్వే ప్రభూ!' అని సంపూర్ణంగా హరిని నమ్మాడు ప్రహ్లాదుడు.

ప్రశాంతత నీ ఇల్లే అని తెలిసికూడా దానినెందుకు అవగాహన చేసుకోవు? భగవంతుని కృపయే మనని ఇలా నిలబెడుతోంది. అందుకే "నీ దయచాలునురా! కృష్ణా! కాదనకీయరా నాకీ వరము" అని ఆ పరమాత్మని ప్రార్థిస్తే చాలు. మనం నమ్మిన ఆ దివ్యపాదం ఈ ప్రపంచం అంతా నిండిఉన్నది. ఈ విశ్వమంతా ఆయనపాదమే అయినప్పుడు మనం ఆ పాదాన్ని అలంకరించిన మువ్వలం కాదా! మనం ఆ భగవంతుని పాదాన్ని అలంకరించిన మువ్వలకి స్పందిస్తున్నామా? లేక మన మనస్సుకి స్పందిస్తున్నామా? సృష్టిలోని ప్రత్యణువునీ లాలిస్తున్నాడా పరమాత్మ. మనని లాలించి, పాలించి, ఆడుకుంటున్నాడు.

మనం అమృత స్వరూపులం. ఎందుకంటే మనకి భగవన్నామామృతాన్ని అందించారు శ్రీగురుదేవులు. మనతో ఎంత ఆడుకున్నా, తాను మాత్రం తత్త్వస్వరూపుడనని గుర్తుచేస్తున్నారు. నీవు కదులుతూ ఉంటే నీ మనస్సు వక్రిస్తుంది. సాధకుడు ఎంత ఆనందంతో ఓలలాడతాడో, అంత జాగ్రత్తగా ఒళ్ళు దగ్గరపెట్టుకుని ఉండాలి. అజాగ్రత్తగా ఉంటూ ప్రశాంతత రమ్మంటే ఎక్కడి నుండి వస్తుంది? భగవంతుడి కృపకు అందరూ పాత్రులే. మనం ఆ భగవంతుడి ఒడిలో ఉన్నాము. లేదా ఆయననే మన ఒడిలో కూర్చోపెట్టుకున్నాము. మన ధ్యానానికి ఈ ముద్ర చాలదా?

నిన్ను నువ్వు గుర్తించు. ఎక్కడికక్కడ గుర్తించాలి. భగవన్నామ రసం మనకి బలాన్నిస్తోంది. దానికి సైడ్ ఎఫెక్ట్స్ లేవు. మనస్సుని అంతర్ముఖం చేసి, ఎవరు ఆ అనుభవం పొందుతారో వారికి ఎప్పుడూ నిత్యనూతనమే. అపథ్యం చేయకు సుమా! అలా చేస్తే భవరోగం మళ్ళీ మొదలవుతుంది. కనుక ఈ మన్మథ నామ సంవత్సరంలో మీ మనస్సులని మథించి, మన్మథుణ్ణి జయించి, అంతర్ముఖులై, అఖండ ఆనందాన్ని పొందెదరు గాక!

# ఆపద్బాంధవుడు

- మైలవరపు సుశీలా శాస్త్రి

శ్రీసద్గురుదేవులతో బుల్లిమామయ్య, బుల్లి అత్తయ్య అని పిలిపించుకున్న ఆ దంపతులు ధన్యులు. వారు నాకు బుల్లితాతయ్య, బుల్లి అమ్మమ్మ అవుతారు. వారిది వడాలి గ్రామం.

ఒకనాటి వేసవికాలం మండుటెండలో శ్రీ గురుదేవులు వడాలి వచ్చారు. శ్రీబాబు మా తాతయ్యనుద్దేశించి "బుల్లిమామయ్యా! పొలంలో ఏం పనిచేస్తున్నావు?" అని అడగటం, "కుప్పనూర్పిళ్ళు చేస్తున్నాను" అని ఆయన చెప్పటం జరిగింది. అంతేకాదు "ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి వర్షం పడితే బాగుంటుంది బాబూ" అని కూడా ఆయన అనటం జరిగింది. "సరే మామయ్యా! రేపు సాయంత్రం 5గం॥లలోపు నీ కుప్ప నూర్పిళ్ళు పూర్తిచేసి, ధాన్యం ఇంటికి చేర్చు. నీ కోరిక నెరవేరుతుంది" అని సద్గురుదేవులు హెచ్చరించారు.

అలాగే మా బుల్లితాతయ్య ధాన్యం నూర్పించి సాయంత్రానికల్లా ఇంటికి చేరవేస్తుంటే ఊళ్ళో వాళ్ళంతా నవ్వుకున్నారు. దానికి కారణం లేకపోలేదు. అప్పటి ఎండ తీవ్రతను బట్టి అసలు వాన వచ్చే అవకాశమే లేదు. ధాన్యం బండి ఇంటికిచేరటం, మబ్బులు క్రమ్మి వెంటనే కుండపోతగా వర్షం కురవటం జరిగి, ఆ ఊరివారందరికీ ఆశ్చర్యం కలిగించింది. అంతేకాదు ఆ వాన అలా వారం రోజులు పడుతూనే ఉంది.

ఇది ఇలా ఉండగా మరొకసారి సద్గురుదేవులు సపరివారంగా రెండుకార్లలో భీమవరం వెడుతూ వడాలిలో దిగి, "బుల్లి అత్తయ్యా! అందరికీ భోజనాలు ఏర్పాటు చెయ్యి" అన్నారు. గురుదేవులు వచ్చారంటే ఇంట్లో అంతా సందడే. ఎలాగో వంటలు పూర్తి అయ్యాయి. ఇంట్లో నెయ్యి లేదు. నెయ్యికోసం ఊరంతా గాలించినా కూడా ఎక్కడా దొరకలేదు. నెయ్యి లేకుండా వడ్డన చేయటం ఎలాగా? అని ఆలోచిస్తుండగా, గురుదేవులు వచ్చి, "అత్తయ్యా! ఏమిటి ఆలస్యం వడ్డించడానికి?" అని హెచ్చరించటం, ఆవిడ "నెయ్యి లేదు బాబూ!" అనటం జరిగింది.

వెంటనే శ్రీబాబు "ఆ గిన్నె ఇలా ఇవ్వు" అని నెయ్యి గిన్నె తీసుకుని ఆయనే స్వయంగా వడ్డన చేయటం ప్రారంభించారు. అది అక్షయపాత్ర అయింది. "తినండి. మొహమాట పడకండి. ఆవకాయలో బాగా నెయ్యి

కలుపుకుని తినండి బాగుంటుంది" అని హెచ్చరిస్తూ నెయ్యి అందరికీ ధారాళంగా వడ్డించారు అయినా అది తరగటం లేదు. భోజనాలు అయ్యాక "అత్తయ్యా! తీసుకో నెయ్యి పాత్ర" అంటూ ఆవిడకు పాత్రనిండా నేతితో చేతికి అందించారు శ్రీబాబు.

ఆ దంపతులు ఇద్దరూ ఒకసారి శ్రీబాబూజీతో కలిసి ఉత్తరదేశ యాత్రకు వెళ్ళారు. ఆ రోజు ఎక్కడా కూడా ఏమీ తినటానికి లేకుండా పోయింది. వారిద్దరూ బాగా అలసిపోయారు. ఇంతలో ఒక చిన్నపిల్లవాడు ఒక ముంతలో పెరుగు తీసుకువచ్చాడు. శ్రీబాబు అక్కడున్న అందరికీ ఒకొక్క స్పూన్ పెరుగును అందించారు. దానితోనే అక్కడున్న అందరికీ ఆకలి మటుమాయం! ఎవరికీ ఎటువంటి నీరసమూ లేదు.

శ్రీబాబు మాట్లాడుతూ "ఏమీ తినటానికి దొరకలేదని బాధ పడుతున్నారా? ఈ రోజు ఏకాదశి పుణ్యదినం. పుణ్యంమంతా మీదే చక్కటి ప్రసాదం దొరికింది" అన్నారు.

మా బుల్లితాతయ్య ఇల్లుకట్టుకున్నారు. కట్టటం పూర్తి అయింది. మా తాతయ్యకి అనారోగ్య కారణంగా ఇంజెక్షన్ చేయించుకుంటే అది సెప్టిక్ అయి చెయ్యి తీసివేసే పరిస్థితి వచ్చింది. ఇంతలో గురుదేవులు వచ్చారు. ఇల్లంతా పరికించి చూసి, "ఇదేమిటి మామయ్యా! ఇలా చేశావు? ఈశన్యంమూల మెట్లు పెట్టించావు. వెంటనే ఆ మెట్లు తీయించివేయి. అదే నీ అనారోగ్యానికి కారణం. డబ్బు లేదని సందేహించకు. నీ ప్రాణానికే ముప్పు వస్తుంది. డబ్బు సమకూరిన తరువాత మెట్లు నైరుతిలో కట్టుకోవచ్చు" అన్నారు. ఆయన ఆజ్ఞ పాలించిన మరుక్షణమే తాతయ్యకు స్వస్థత చేకూరటం జరిగింది. విశ్వసించిన వారికి వెనువెంటనే ఉండి, అనుక్షణం కంటికి రెప్పలాగా కాపాడే ఆపద్భాంధవుడు బాబు! వారి ఋణం ఎలా తీర్చుకోవటం??

సమర్థ సద్గురు మాసపత్రికలో ధరావాహికంగా వెలువడుతున్న 'విష్ణుకథలు' మూడు భాగాలుగా ప్రచురించబడ్డాయి. ప్రాప్తిస్థానం సమర్థ సద్గురు పబ్లికేషన్స్, శ్రీకాళీగార్డెన్స్, నంబూరు -522 508 నందగోపాల్ - ఫోన్ నెం : 94407 4106

# సౌందర్యం !?

- రమణ ప్రసాద్

"ఈ బాహ్యసౌందర్యం ఎంతవరకు? నీ ముఖం నువ్వు చూసుకోలేవు. నీ వీపు నువ్వు చూసుకోలేవు. చూడాలంటే అద్దం కావాలి. అద్దంలో చూసుకుని 'ఎంత అందంగా ఉన్నానో' అనుకుంటావు. ఈ నాడు ఉన్న అందం రేపు ఉండదు. దానికి మార్పు ఉంది. బాహ్య సౌందర్యం కంటె మనో సౌందర్యం ఉత్తమం" అంటారు శ్రీ మాతాజీ.

స్త్రీలకు సౌందర్యం పట్ల ఆసక్తి, పురుషులకు స్త్రీ వ్యామోహం ఆధ్యాత్మిక సాధనకు అంతరాయాలు. అటువంటి వికారాలు మనసులో కలిగితే వాటిని మహాత్ములు ఎలా తొలగిస్తారో, ధనుర్దాసు అనే మల్లయోధుని జీవితం చూస్తే తెలుస్తుంది. ఒకనాడు శ్రీరామానుజులవారు శిష్యులతో వెళ్తుండగా, ధనుర్దాసు అనే వ్యక్తి హేమాంగి అనే స్త్రీకి గొడుగు పడుతూ వెళ్ళటం చూస్తాడు. శ్రీ రామానుజులు అది గమనించి, శిష్యులతో కారణం అడిగిస్తే, " ఆమె కళ్ళంటే నాకు ఎంతో ఇష్టం" అని వారితో చెబుతాడు ధనుర్దాసు. శ్రీరామానుజులవారు అతనిని పిలిపించి,"నీకు ఇంతకంటె అందమైన కళ్ళు చూపిస్తే ఆమె మీద వ్యామోహం వదిలేస్తావా?" అంటే అతడు"సరే" అన్నాడు. శ్రీ రామానుజులవారు అతనిని ఆలయానికి తీసుకొని వెళ్ళి, శ్రీరంగనాథస్వామి దర్శనం చేయిస్తే, ఆ స్వామికి సాటి అయనది ఈ జగత్తులో లేదని గుర్తించి, ధనుర్దాసు శ్రీరామానుజులవారి శిష్యుడై భగవద్భక్తుడిగా రాణించాడు.

ఇంకొక దృష్టాంతం తీసుకుందాం: రత్నాంబరుడు అనే గురువు తన శిష్యులైన శ్వేతాంకుడు, విశాలదేవులకు ఏ విధంగా మానవులు పరిస్థితుల ప్రభావం వల్ల జీవితంలో పతనమౌతారో చెబుతూ- పాప పుణ్యాలు అనేవి లేవు. ప్రతివాడు తాను ఎదుర్కొనే పరిస్థితుల ప్రభావంచేత కర్మలు చేస్తాడు. మీకు చిత్రలేఖ అనే అందాల రాశి గురించిన కథ వివరిస్తాను - ఆమె చంద్రగుప్త మౌర్యుని రాజ్యంలో రాజ నర్తకి. బీజగుప్తుడు ఉన్నత సైనికోద్యోగి. సంపన్నుడు. విలాసమయమైన జీవితం గడిపేవాడు. ఒకనాడు రాజ దర్బారులో చిత్రలేఖ నాట్యం చూసి మోహితుడై,చిత్రలేఖ గృహానికి వెళ్ళాడు. ఆస్థాన కులగురువైన కుమారగిరి బీజగుప్తునితో,"నువ్వు చేస్తున్నది తప్పు. చిత్రలేఖ ఇంటికి వెళ్ళటం మాని నీ సంసారాన్ని చక్కబెట్టుకో"అని చెబుతాడు.

చిత్రలేఖతో,"నువ్వు ఎందరెందరివో కాపరాలు కూలుస్తున్నావు. నీ ప్రవర్తన మార్చుకో. నువ్వు చేస్తున్నది పాపం" అని హెచ్చరిస్తాడు కుమారగిరి.

తన అందం శాశ్వతం. అందమే తన సర్వస్వం అనే అతిశయంతో కుమారగిరిని ధిక్కరిస్తూ - "విషయాలకు దూరంగా పరిగెత్తేవాడివి నువ్వు భగవంతుడిని ఎలా పొందగలవు? ఈ లోకంలో నువ్వు ఏదీ అనుభవించలేదు. పరలోకంలోకూడా నీకు నిరాశే ఎదురవుతుంది. పాప పుణ్యాలు ధర్మం యొక్క రీతులు. అవి ప్రతియుగంలో మారుతుంటాయి. అలా మారే ధర్మాలను ఆదర్శంగా ఎలా తీసుకోవటం? ఈ భోగం కూడా ఒక విధమైన తపస్సే. అన్నిటినీ త్యజించిన నీకు అది ఎలా తెలుస్తుంది? ఈ సుఖాలు,భోగాలు సత్యం అని నేను అంటాను. నువ్వు ఇదంతా మిధ్య అంటావు. నేను ఈ జన్మలో అన్నీ అనుభవించి పోతాను. నువ్వు నీ జన్మ వృధా చేసుకొని పోతావు"అంటుంది. చేసేదేమీ లేక కుమారగిరి వెళ్ళిపోతాడు.

అయితే చిత్రలేఖ, బీజగుప్తులలో మార్పు వచ్చే సమయం ఆసన్నమైంది. బీజగుప్తుడు సముద్రతీరంలో నడుస్తూ ఇలా ఆలోచిస్తున్నాడు- "ఓ మనసా! ధీరత్వాన్ని పొందు. జీవితంలో ఏది కోరుకోవాలో నీకు తెలియదు. దేనిని కోరకూడదో దానిని కోరుతున్నావు. ఓ మనసా! ఆలోచించు! జీవితంలో వచ్చే చీకటి వెలుగులను ఎవరైనా ఆపగలరా? ఈ జగత్తులో విరసిన అందాలను నియంత్రించటం ఎవరికైనా సాధ్యమేనా? నీకు లభించిన దానితో తృప్తి పడు. ఈ జనన మరణాల ఆటను ఒక స్వప్నంగా భావించు. ఎవరూ నీ వెంట రారు అనే సత్యాన్ని గుర్తించు" అని వివేకదృష్టితో ఆలోచించి తన గమ్యం ఏమిటో తెలుసుకొన్నాడు.

ఒకనాడు చిత్రలేఖకు సింగారం చేస్తున్న పరిచారిక," దేవీ! ఇదిగో మీ తలలో ఒక తెల్ల వెంట్రుక. దీనిని తీసివెయ్యనా? అన్నది. అంతే! అద్దంలో ముడుతల ముఖంతో,తెల్లగా మారిన జుట్టుతో అంద విహీనంగా ఆమెకు తన ముఖం కనిపించింది. "ఓహో! నేను ఇలా అవుతానన్నమాట. నేను కుమారగిరిని ఆశ్రయించి జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని ఆయన ఆశ్రమానికి వెళ్తుంది. తనను ఆశ్రయించ వచ్చిన చిత్రలేఖను చూసి పరవశుడై ఆమె పొందు కోరతాడు కుమారగిరి. ఆమె ఎలాగో తప్పించుకొని బీజగుప్తుని వద్దకు చేరుతుంది.

(తరువాయి భాగం కోసం 12వ పేజీ చూడండి)

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

24-2-1985

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "మీకు ఇంకొక ఉపమానము చెపుతాను. ఒక పంచదార గ్లాసు, నీళ్ళగ్లాసు ప్రక్కప్రక్కనే ఉన్నాయనుకోండి ఏమిటి లాభం? నీరు పంచదార మధురత్వాన్ని పొందగలుగుతుందా? నీరు, పంచదార కలిసిన పానకాన్ని అగ్నికి దగ్ధం చేస్తే నీరు ఆవిరియై మధురమే మిగులుతుంది. ఆ మధురమే ఆత్మ స్వరూపం. గురులక్ష్యార్థంపై మనస్సు నిలిపి ధ్యానిస్తే ఆ మధురాన్ని అందుకోగలుగుతావు. అంతటి మధురాన్ని అందజేసే పరమాత్ముడిని మానవుడు ప్రేమించగలుగుతాడా? కాఫీని, ఇడ్లీని తన దారాపుత్రాదులను ప్రేమించినంతగా ప్రేమించ గలుగుతాడా?



ఒక ఆయన ఎంతగానో కష్టపడి సంపాదించిన ధనంతో విలువైన బిల్డింగ్ కట్టించాడు. ఆస్తిని సంపాదించాడు. ఆయన మరణించాడు. ఆయన పుత్రులు ఇద్దరు అమెరికాలో ఉన్నారు. వారిద్దరి రాకకోసం ఆయన శవాన్ని అంటే ప్రేతని ఉంచారు. వారిద్దరు అమెరికానుంచి రావాలంటే టైము పడుతుంది కదా!

ఒకరోజు గడిచిపోయింది. రెండవ రోజు ఆ శవం ప్రక్కన కూర్చోవాలంటే ఇబ్బందిగా ఉంది భార్యకు. తాను ఎంతగానో ప్రేమించిన భర్త శవమే. తనకు డైమండ్ నెక్లస్ చేయించిన తన భర్త శవమే. కానీ కూర్చోలేదు. మనస్సులో భావం వేరు. కొడుకుని పిలిచింది. 'పాత సంగతులు అన్నీ గుర్తుకు వస్తున్నాయిరా! 50 సంవత్సరాల దాంపత్య జీవితం గడిపిన మా యిరువురి ప్రేమ మీకేమి తెలుసురా! నేను మీ నాన్నగారి ప్రక్కన కూర్చోలేకపోతున్నానురా మీరెవరైనా కూర్చోండిరా?' అని అంటుంది ఆ యిల్లాలు. ఇంక ఆ కొడుకు ప్రేమ ఎలా ఉంటుందో చూద్దాం. 'అమ్మ చెప్పినట్టు వినకపోతే ఆస్తి ఇవ్వదేమో? పోనీ

కూర్చుందామంటే శవం ప్రక్కన ఎలా కూర్చోవటం?’ అని కొడుకు లోపల భావన చేస్తూండగా ‘ఏవండీ మిమ్మల్నే’ భార్య పిలిచింది. ‘ఆశవం ప్రక్కన ఎలా కూర్చుంటారండీ? వాసన వస్తుంది. 50 రూపాయలో లేక 100 రూపాయిలో ఇచ్చి ఎవరినైనా పనివాళ్ళను కూర్చోమనండి’ అని అంటుంది భార్య. ఆ భార్యావిధేయుడు ‘సరే’ అంటాడు. ఇలా ఉంటాయి మానవుల ప్రేమలు. భగవానుని ప్రేమ అలా ఉండదు. ఆయన ఎప్పటికప్పుడు తన ప్రేమని అందించి తనలో ఎప్పుడు చేర్చుకుందామా అని ఆవేదన చెందుతాడు” అన్నారు శ్రీబాబు.

(సౌందర్యం!? - 10వ పేజీ తరువాయి భాగం)

“తను చేసింది ఏమిటి? పరిస్థితులకు లొంగి ఎలా ప్రవర్తించాను?” అనే పశ్చాత్తాపంతో కుమారగిరి నదిలో ప్రాణ త్యాగం చేయటానికి వెళ్తూ పాముకాటుకి గురి అవుతాడు. “నాకు తగిన శిక్షే పడింది” అంటూ ప్రాణాలు విడుస్తాడు.

“అటువంటిది పరిస్థితుల ప్రభావం. వాటి వత్తిడి వల్ల చేసే కర్మలను వివేకదృష్టితో నియంత్రించకపోతే పతనం తప్పదు” అని రత్నాంబరుడు తన శిష్యులకు వివరిస్తాడు.

మాకురు ధన జన యౌవన గర్వం హరతి నిమేషకాలసర్వం।
మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా॥

“నేను ధనవంతుడిని. నా వెంట నా వారు ఉన్నారు. నేను యౌవనంలో ఉన్నాను అని గర్వించకు. ఇవి క్షణభంగురాలు. కన్ను మూసి తెరిచేలోగా హరించిపోతాయి. ఇది శాశ్వతం కాదు. ‘యేతన్మాంసవసాదివికారం’ ఇవి మజ్జ, రక్తము,క్రొవ్వు మొదలగు పదార్థాలతో నిండిన శరీరం యొక్క వికారాలు - అని తెలుసుకొని వాటిని విడిచి బ్రహ్మ పదాన్ని చేరుకో” అని శ్రీ శంకరపాదాచార్యులవారు ‘భజగోవిందం’లో సెలవిచ్చారు.

కాబట్టి సాధకుడైనవాడు బాహ్య సౌందర్యం కాక ఆత్మ సౌందర్యాన్ని కోరాలి. ఇంద్రియ సంయమనం కలిగి శ్రద్ధతో సాధన చేస్తే జ్ఞానం లభిస్తుంది. ‘జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం అచిరేణాధిగచ్ఛతి” - జ్ఞానం లభించినంతనే పరమమైన శాంతి, - అచిరకాలంలో సిద్ధిస్తుంది.

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

## జనక మహారాజు కథ

మానవుని మోక్ష సాధనకు ముఖ్యంగా రెండు మార్గాలున్నవి. మొదటి మార్గములో శిష్యునిగా గురుదేవుని వద్ద ఉపదేశాన్ని పొంది, వారాదేశించిన మార్గంలో జీవితాన్ని మలుచుకోవటం, మోక్షము గురుమూర్తి వద్ద ఉపదేశము పొందిన జన్మలోనే రావచ్చు లేక మరు జన్మలో రావచ్చు. రెండవ మార్గము స్వయం కృషితో ఆత్మ జ్ఞానమును పొందుట, ఆత్మ సాధన ద్వారా మానవునికి జ్ఞానము సహజంగా వస్తుంది, స్వర్గము నుండి అనూహ్యంగా ఫలం రాలినట్లు బ్రహ్మ జ్ఞానము ఉదయిస్తుంది. ఆకాశము నుండి అనుకోకుండ ఫలము రాలినట్లు ఆత్మ జ్ఞానమును రెండవ మార్గము ద్వారా ఆత్మ జ్ఞానమును పొందిన నొక మహనీయుని కథ నీకు చెప్తాను" అన్నాడు వశిష్ఠ మహర్షి.



విదేహ రాజ్యాన్ని సత్శీలుడు, మహిమాన్వుడయిన జనక మహారాజు పరిపాలించేవాడు, ఆయన గొప్ప సంపన్నుడు, వున్నతుడు, ఉదార స్వభావుడు. శ్రీ మహావిష్ణు లాగా, ఆయన తన ప్రజలను రక్షించేవాడు, జనక మహారాజు సుగుణ సంపన్నుడు.

వసంత కాలంలో ఒక రాజు ప్రకృతత్యంతరమణీయమై, పరిమళభరితమై, పలురకాల పుష్పాలతో విరాజిల్లే ఉద్యాన వనములో ప్రవేశించాడు, ఆయన తన మంత్రులను, పరివారాన్ని బయట వదలి, తానొక్కడే ఉద్యానవనములో సంచరిస్తున్నాడు. అప్పుడాయన సిద్ధపురుషులు పాడేపాటలు వినటం సంభవించింది. ఓ కమలాక్షుడైన రామచంద్రా! తమ అనుభవాన్ని రంగరించి, ఆ సిద్ధులాలపించిన గీతాలను, నీకు వినిపిస్తాను.

మొదట సిద్ధపురుషుడిలా పాడాడు, "జ్ఞాని, జ్ఞానము కలిసి పోతాయి, జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది, అప్పడు ఉదాత్తమైన జ్ఞానము, ఆనందము లభిస్తుంది. అదే ఆత్మ జ్ఞానము, దాని కోసమే ఆరాటపడాలి. రెండవ సిద్ధుడిలాపాడాడు "అన్ని వాసనలను నిర్మూలం చేసి, దృశ్య వస్తువులన్నిటిని వదలివేసి, కాంతికే కాంతియైన ఆత్మ లేక

బ్రహ్మమునందు మనసు లగ్నముచేసి, నిరంతరము ధ్యానము చేయాలి".

మూడవ సిద్ధుడిలా పాడాడు "మనము సర్వ వ్యాపకమై, అన్ని వస్తువులను ప్రకాశింప చేసే శాశ్వతమై, సత్తు, అసత్తుల మధ్య దేనికి సంబంధించకుండా వుండే జ్యోతిపై యేకాగ్రతతో, నిరంతర ధ్యానము చేయాలి". నాల్గవ సిద్ధుడిలా ఆలాపించాడు "మనము స్వయం ప్రకాశమైన ఆత్మపై ఏకాగ్రతతో ధ్యానము చేయాలి ఆత్మ జీవులలో 'నేను'గా పిలువబడుచున్నది. అది 'అ'తో ప్రారంభమై, 'హం'తో అంతమవుతున్నది (అహం) దీనిని మనము నిరంతరము "సోఽహం" యని ఉచ్ఛ్వాస, విశ్వాసములో ఊపిరి పీల్చుకొంటున్నాము".

కొంతమంది సిద్ధులిలా పాడారు "సర్వమూ తానైన నిజమైన ఉనికిని మనమారాధిస్తున్నాము. అన్ని వస్తువులూ దానికి సంబంధించినవే, దానితో చేయబడినవే, మనము దేని నుండి ఉత్పన్నమైనామో, దానిని ఆరాధిస్తున్నాము దానిలోనే ఉత్పన్నమై, పెరిగి, తిరిగి దానిలోనే లయమైపోతున్నాము". మరికొంత మంది సిద్ధులిలా పాడారు. "ఎవరు తమ హృదయాంతరాల్లో వున్న భగవంతుని విస్మరించి, బయట భగవంతునికై వెదుకుతారో, వారు తమ చేతిలో పెట్టిన అమూల్యమైన కౌస్తుభమణిని వదిలివేసి, శంఖపు గవ్వలకై, ప్రాకులాడే లాంటివారు." మరొక సిద్ధుల సమూహమిలా పాడారు "ఎవరైతే తమ కోరికలను సంపూర్తిగా నిర్మూలం చేస్తారో, వారే ఆత్మానుభూతిని పొందుతారు." మరికొందరు సిద్ధులిలా పాడారు "ఎవరైతే యీ ప్రాపంచిక విషయాలలో లభించే భౌతిక సుఖానికి ఉనికి (సత్తా) లేదని తెలిసి కూడ, వారి మనసులు భౌతిక సుఖాలపైనే లగ్న మౌతాయో, వారు కేవలము గాడిదలే, మనుషులు కారు."

ఐదవ సిద్ధ సమూహాలిలా పాడారు "ఇంద్రియములనే సర్పాలు, శరీరములనే సొరంగాల నుండి, మరల, మరల పైకిలేచి బుస కొడ్తాయి. ఇంద్రుడు పర్వతాలను తన వజ్రాయుధముతో తునియలు చేసినట్లు, యింద్రియాలనే సర్పాన్ని, వివేచనా శక్తి యనే ఆయుధముతో చంపాలి." చివరి సిద్ధ సమూహమిలా పాడారు "ఎవరైతే ప్రశాంతమైన మనసుతో, సమదృష్టి కలిగి వుంటారో, వారు సత్య జ్ఞానానంద స్వరూపులై, వారు నిత్యమైన ఆత్మ స్థితిని చేరుకొంటారు అదే మోక్షము లేక అంతిమ స్వేచ్ఛ".

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ కార్యక్రమాలు

ఏప్రియల్ 2015

4 శని : చైత్ర పౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ, చంద్రగ్రహణం.

14 మంగళ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

17 శుక్ర : మాసశివరాత్రి ; పావులూరు బ్రాంచిలో ఏకాహం.

18 శని : అమావాస్య

21 మంగళ : అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ.

23 గురు : శ్రీ శంకర జయంతి, శ్రీసద్గురు వింశతి వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

మే 2015

4 సోమ : వైశాఖపౌర్ణమి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన

9 శని : శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము. లీలా కళ్యాణము

13 బుధ : హనుమజ్జయంతి, శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, హనుమాన్‌చాలీసా పారాయణ

16 శని : మాసశివరాత్రి, శనిత్రయోదశి. పావులూరి బ్రాంచిలో శ్రీఅవధూతేంద్ర సరస్వతి స్వామివారి వార్షిక పుణ్యారాధన మహోత్సవములు.

18 సోమ : అమావాస్య

27 బుధ : శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి సప్తమ వార్షికారాధన

---



పాఠకులకు
మన్మథ నామ సంవత్సర
శుభాకాంక్షలతో

# పరిప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

విధి నిర్ణయాన్ని ఎవరూ తప్పించుకోలేరు కదా! మరి ప్రారబ్ధ కర్మను రహితం చేసుకునే మార్గమే లేదా? అన్న సందేహాన్ని నివృత్తి చేస్తూ, శ్రీ సద్గురు దేవులు "నీ నెత్తిమీద ఉన్న బరువును దించు కోవటానికి ప్రయత్నం చేయకుండా ఎవరో సహాయం చేయలేదంటే



ఏం లాభం? మనస్సు నీరులాగా అవకాశం దొరికితే జారిపోతుంది సుమా! అని హెచ్చరించి, దానిని కట్టడిచేసే మార్గాన్ని తెలియజేసి, లక్ష్యార్థాన్ని ప్రసాదించిన సద్గురుమూర్తి హెచ్చరికను పెడచెవిని పెట్టి, ప్రారబ్ధకర్మ రహితం అయ్యే మార్గం లేదా? అంటే ఎలా? అంతేకాదు పుణ్యకార్యాలు చేస్తే కర్మరహితం అవుతుందని కదా మీరంతా పుణ్యకార్యాలు ఆచరించేది. మరి అంతమాత్రం విశ్వాసం సద్గురు మూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధనద్వారా రహితం అవుతుందని ఎందుకు ఊహించలేక పోతున్నారు?

పూజ, ఉపాసన, యజ్ఞయాగాదుల ద్వారా కర్మ రహిత మవుతుందేమో కాని కర్మకి కారణమైన వాసన రహితం కావాలంటే మాత్రం సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధన చేసి, ఆయన అనుగ్రహానికి పాత్రుడవ్వాలి. ఈ దేహేంద్రియాలను ఎంతవరకు వాడుకోవాలో అంతవరకే వాడుకుని వాటికి విలక్షణంగా ఉండగలిగిన సాధకునికి ప్రారబ్ధకర్మ బాధించ గలుగుతుందా?

సాధకుడు ప్రపంచంలో మనుష్యుల మధ్య సంచరించినా, మనస్సు విషయాదులతో మిళితం కాకుండా విలక్షణంగా ఉంటే, కావల్సినది ఏముంది? అలా నేను హెచ్చరిస్తుంటే అంతటి సంస్కారం పొందటం సాధ్యమా అంటారు. సంస్కారానికి ఏం లోటు వచ్చింది? మానవ జన్మ వచ్చింది; సద్గురుమూర్తి సమాశ్రయం లభించింది; అయితే దాన్ని గుర్తించ గలగాలి కదా! అది గుర్తిస్తే నువ్వు ముముక్షువువే కదా!

# గురువంటే తెలుసుకో

- పెనుమాక నాగేశ్వరరావు

గురువంటే తెలుసుకో, జన్మంతా కొలుచుకో
మనసంతా నిలుపుకో, జగమంతా చూసుకో
బ్రతుకంతా తలుచుకో, బరువంతా దింపుకో
ధ్యాసంతా నిలుపుకో, ధ్యానం చేసుకో ॥గురువంటే॥

హృదయంలో చేర్చుకో, పదిలంగా దాచుకో
మకరందం అందుకో, మాధుర్యం పంచుకో
కారుణ్యం పెంచుకో, కైవల్యం కోరుకో
ధర్మాన్నే ఎంచుకో, దైవాన్నే నమ్ముకో ॥గురువంటే॥

సంయమనం నేర్చుకో, సత్సంగం కూర్చుకో
సందేశం అందుకో, సందేహం తీర్చుకో
సోపానం పేర్చుకో, అందాకా ఓర్చుకో
మార్గాన్నే మార్చుకో, గమ్యాన్ని చేరుకో ॥గురువంటే॥



# గీతాధ్యయనమ్

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

## కర్మయోగం

ఇక్కడ అర్జునునికి ఒక సందేహం వచ్చింది. "కర్మకంటె జ్ఞానం మంచిది అంటావా కృష్ణా! మరి అటువంటప్పుడు ఈ ఘోర యుద్ధానికి నన్నెందుకు పురికొల్పుతున్నావు? ఈ రెండిటిలో ఏది మేలైన మార్గమో అది చెప్పు" అని అడిగాడు. దానికి భగవానుడు ఇలా అంటున్నాడు....



లోకేఽ స్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽ నఘ! ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

పూర్వం నేను చెప్పినట్లుగా సాంఖ్యులకు (తత్త్వ విచారణ చేసేవారికి) జ్ఞానయోగం, యోగులకు నిష్కామకర్మయోగం అని రెండు మార్గాలు లోకంలో ఉన్నాయి. అయితే,

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మకృత్।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః ॥ 5

కర్మలు చేయకుండా ఎవడూ ఒక్క క్షణం కూడా ఉండలేడు. ప్రకృతి గుణాల ప్రభావానికిలోనై, ప్రతివాడూ కర్మలు చేస్తూనే ఉన్నాడు. పోనీ, ఇంద్రియాలను అణిచిపెట్టినా, మనస్సులో కలిగే విషయాదుల వల్ల ప్రవర్తించేవారిని కపటచారం కలవాడు అంటారు.

నీ కర్తవ్య కర్మ నువ్వు చేయాల్సిందే కర్మలు చేయకుండా జీవన యాత్ర సాగదు. యజ్ఞయాగాది కర్మలు తప్ప మిగతావి సంసార బంధాన్ని కలుగజేస్తాయి. ఫలాపేక్ష లేకుండా చేస్తే ఆ కర్మలఫలం నీకు అంటదు. యాగకర్మలు సంసార బంధాన్ని కలుగజేయవు. యజ్ఞయాగాదుల వలన దేవతలు సంతుష్టి చెంది ఇష్టకామ్యాలను ప్రసాదిస్తారు. అలా యజ్ఞాలు చేసి, దేవతలకు అర్పించగా మిగిలిన పదార్థాలను స్వీకరించేవారు సర్వ పాపాల నుండి విముక్తులవుతారు. అలాకాకుండా ఎవరు చేసుకున్న పదార్థాలను వారే ఆరగించేవారు పాపాలను మూటకట్టుకున్నవారౌతారు.

అన్నం నుంచి ప్రాణులు పుడుతున్నాయి. వర్షం అన్నం వల్ల కలుగుతోంది. ఆ వర్షం యజ్ఞం వల్ల, ఆ యజ్ఞం సత్కర్మవల్ల సంభవిస్తోంది.

కర్మ వేదం నుండి పుట్టింది. పరమాత్మ వల్ల వేదం వెలసింది. సర్వవ్యాపి అయిన ఆ పరమాత్మ నిత్యం యజ్ఞంలో ప్రతిష్ఠితమై ఉన్నాడు.

ఆత్మయందే రమించి సంతోషించేవాడికి విద్యుక్త కర్మలేవీ ఉండవు. కాబట్టి మనం చేసే కర్మలు నిష్కామంగా ఉండాలి.

తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచర।
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః॥ 19

అట్టివారికి మోక్షం లభిస్తుంది. జనకాదులు నిష్కామకర్మాచరణ వలన మోక్షాన్ని పొందారు.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదను వర్తతే॥ 21

ఉత్తముడు చేసే కర్మలను, చేసేవానిని జనులు ప్రమాణంగా తీసుకుని అనుసరిస్తారు.

పార్థా! నాకు ముల్లోకాలలోనూ చేయవలసిన పనిలేదు అయినప్పటికీ లోక వ్యవహారాలను ఆచరిస్తూనే ఉన్నాను. నేను కర్మలు చేయకపోతే ప్రజలంతా భ్రష్ఠులౌతారు.

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః॥ 30

కాబట్టి నువ్వు చేసే కర్మలు నాకు సమర్పించు. ఆశ మమకారాలను వీడి యుద్ధం చెయ్యి - అని భగవానుడు సెలవిచ్చాడు.

అప్పుడు అర్జునుడికి సందేహం వచ్చింది. "కృష్ణా! తనకు ఇష్టం లేక పోయినా, మానవుడు దేనివల్ల పాపాలు చేస్తున్నాడు?" అని అడిగాడు. దానికి భగవానుడు "రజోగుణం వలన కలిగిన కామక్రోధాలే పాపాలకు మూలకారణం. ఇవి మానవుడికి మహాశత్రువులు. వీటికి ఆశ్రయం ఇచ్చేవి ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి. ఇవే జ్ఞానాన్ని ఆవరించి మోహాన్ని కలుగ జేస్తున్నాయి.

అందువలన ఇంద్రియాలను నీ చెప్పుచేతల్లో ఉంచుకుని, కామాన్ని పారద్రోలు. దేహం కంటె ఇంద్రియాలు, ఇంద్రియాల కంటె మనస్సు, మనస్సు కంటె బుద్ధి, బుద్ధి కంటె ఆత్మ గొప్పవని గుర్తించు. కనుక జయించరాని శత్రువు కామాన్ని రూపుమాపు." అని చెప్పాడు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

39. ఆలోల లోచన విలోకిత కేళీధరా
విరాజితాగ్ర సరణౌః కరుణామ్బురాశేః
ఆర్ద్రాణి వేణునినదైః ప్రతినాద పూరై
రాకర్ణ యామి మణి నూపుర శిఞ్జితాని ॥

తాత్పర్యము -



చూపులచేత ముందు దారికి కాంతిని కలిగించే, దిక్కులయందు ప్రతిధ్వనిని కలిగించు వేణుగాన ధ్వనులతో కూడిన శ్రీకృష్ణుని అందెల మ్రోవలను ఎప్పుడూ వినుచున్నాను.

తలపుమీద ముని వ్రేళ్ళతో తట్టిన చప్పుడు వింటూ మాలతి "ఈ వేళలో వచ్చినదెవరా?" అని ఆలోచిస్తూ, పడక మీద నుండి లేచి త్వరగా వెళ్ళి తలుపు తెరిచింది. ఎదుట ఉన్న మూర్తిని చూసి బొమ్మలా నిలబడిపోయింది ఇది కలా! నిజమా! అనుకుంటూ.

వెన్నెల వెలుగుల్ని వెలిగించే కంటి కాంతులతో, పట్టు పీతాంబరం మెడలో ముత్యాల మాలలు, వజ్రాల నగలు, ధరించిన మల్లె మాలల పరిమళాలు పరిసరాలు అన్నీ నిండగా శ్యామసుందరుడు! నల్లనయ్య! వెన్నెల కుప్పపోసినట్లుగా నిలబడి ఉన్నాడు.

"నీకిచ్చిన మాట ప్రకారం వచ్చేశాను మాలతీ! లోపలికి రమ్మని పిలవవేమిటి? అయినా నా ఇంట్లోకి నాకు పిలుపెందుకులే? మీ మనస్సులన్నీ నా ఇళ్ళు, వాకిళ్ళే అన్నాను కదా!" అంటూ చకచకా లోపలికి వెళ్ళి మాలతి పడక మీద కూర్చున్నాడు గోపీ కాంతా మనోహరుడు!

ముంగిట్లో మొలచి ఉన్న పచ్చగడ్డి మంచుబిందువులతో తడిసి ఉంది. దానిమీద నడుచుకుంటూ వచ్చాడు జగదోద్ధారకుడు. ఎదురుగ నిలబడి పలకరింతువా? మాటేరాని మూగనౌదురా! అన్న స్థితిలో ఉన్న మాలతి, స్వామి పాదాల మీద ఒరిగిపోయింది. ఆనందాశ్రువులతో పాదాలను తడిపివేస్తూ, పాదాలకంటిన మట్టిని, గడ్డిపరకలను చెంగుతో తుడుస్తూ, "మాపటివేళల మధురమైన నీ తలపులే నాకు ఊపిరులన్నా.

నీతో ఆడుకున్న ఆటలు, పాటలు నాకు జీవితంలో మరుపు రావు. ముఖ్యంగా 'వెన్నెలలో వెన్నముద్ద' అనే ఆట మా అందరితో ఆడించావు కదా. వెన్నెల్లో వెన్నముద్ద అంటే ఏమిటి అని అడిగావు. అందరూ 'ఆకాశంలో చందమామ' అని చెప్పారు. నువ్వు నవ్వుకుని 'సరే అయితే ఆ చందమామనే చూస్తూ మీరంతా దారిలో తప్పటడుగులు వేయకుండా సరాసరి నా దగ్గరకు రండి. అలా వచ్చినవారి కోరికలు తీరుస్తాను' అన్నావు. నేనేమీ మాట్లాడలేదు. "మాలతీ నువ్వు చెప్పు" అన్నావు. "నాకు వెన్నముద్ద నువ్వే కన్నయ్యా!" అన్నాను. నేను నిన్నే చూస్తూ సరాసరి నీ దగ్గరకి వచ్చేశాను. "నీకేం కావాలో కోరుకో" అన్నావు. అప్పుడు నేను "నాకు నీ నిత్య సందర్శన భాగ్యంతోపాటు నీ సాన్నిధ్యం కూడా కావాలి కన్నయ్యా!" అన్నాను. "అలాగే లభిస్తుందిలే" అన్నావు. ఆ తరువాత నేను పెళ్ళై అత్తవారింటికి జాలువారే కన్నీళ్ళతో వచ్చేస్తుంటే, నువ్వు నా కన్నీరు తుడుస్తూ, "నేను మీ ఇంటికి వస్తానులే బాధపడకు" అన్నావు. "అన్నమాట ప్రకారం దయారాశివి కదా! వచ్చావు. నాకు ఎంతో ఆనందంగా ఉంది ప్రభూ!" అన్నది మాలతి.

కన్నయ్య నవ్వుతూ ఆమె తలమీద చెయ్యిపెట్టి దీవించాడు. వెయ్యి మెరుపులు ఒక్కసారి మెరిసినట్లయి ఏవేవో దృశ్యాలు కనిపించ సాగాయి. "ఏమిటి చూస్తున్నావు? మాలతీ" అన్నాడు కన్నయ్య.

"ప్రభూ! అన్నీ చూస్తున్నాను, వింటున్నాను. యమున గలగల ప్రవహిస్తున్న చప్పుడు వినిపిస్తోంది. పారిజాత వృక్షం క్రింద పాలరాతి బండ మీద సుఖాసీనుడవై, పెదవి మీద మురళి నిలిపి, మధురాతి మధురంగా పలికిస్తున్న మోహన రాగాలు వినటానికి నీ చుట్టూ చేరిన వ్రజనారీ సమూహంయొక్క చేతిగాజుల గలగలలు, నవ్వుల కిలకిలలు వినబడుతున్నాయి. బృందావనం అంతా నీ చేతి వెన్నముద్దగా మారిందేమో అన్నట్లుగా పరచుకున్న పూర్ణచంద్రుని నిండు వెన్నెలలు కన్నుల పండుగ చేస్తున్నాయి. వెన్నెలలో వజ్రపు పొడులను ధిక్కరిస్తూ మెరిసే ఇసుకతిన్నెల మీద పరుగులెత్తి యమునాతీరానికి, నీ సాన్నిధ్యానికి నీగానాన్ని వింటూ పులకరించిపోయి రాలుస్తున్న పువ్వుల పాన్పుపై వెలిగిపోతున్న నీ పాదకమలాల చెంతకు నే వస్తున్నాను కన్నయ్యా! నా ధ్యానంలో కదిలి పోకురా! ఓ చపలా!" అంటూ ధ్యానసమాధిలో లీనమైపోయింది మాలతి.

- సశేషం

# చైత్ర - వైశాఖాల విశిష్టత

- రమణ ప్రసాద్

నాన్యాస్పృహా రఘుపతే హృదయేస్మదీయే
సత్యం వదామి చ భవానఖిలాంతరాత్మా ।
భక్తిం ప్రయశ్చ రఘుపుంగవ నిర్భరాం మే
కామాది దోషరహితం కురు మానసం చ ॥

రాఘవా! నా హృదయంలో వేరే ఆశ లేదు. నేను నిజం పలుకుతున్నాను. నీవు అందరి హృదయాలలో ఉండే అంతరాత్మవు. నీ శరణు పొంది నా భారము తగ్గించుకునే భక్తిని ప్రసాదించి, నా లోని కామాది దోషములను రహితం చెయ్యి.

శ్రీరామనవమి హిందువులకు ముఖ్యమైన పండుగ. శ్రీరాముడు వసంతఋతువులో చైత్ర శుద్ధ నవమి పునర్వసు నక్షత్రపు కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం 12 గంటల వేళ జన్మించాడు. పదునాలుగు సంవత్సరాల అరణ్యవాసం, రావణ సంహారం తర్వాత శ్రీరాముడు సీతా సమేతంగా అయోధ్యలో అభిషిక్తుడైన శుభదినము చైత్ర శుద్ధనవమి నాడేనని ప్రజల విశ్వాసం. శ్రీ సీతారాముల కళ్యాణం కూడా ఈ రోజునే జరిగింది. దేశమంతటా తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు జరుపుతారు. రామదాసుచే కట్టబడిన రామాలయంలో, ఇతర ఆలయాలలో శ్రీ సీతారాముల కళ్యాణం నవమినాడు ఎంతో వైభవంగా చేస్తారు.



మార్చి 28 వతేదీన శ్రీరామనవమి. ఉదయం 5గం॥30నిలకు శ్రీకాళీవన ఆశ్రమంలో శ్రీ సద్గురు పాదపూజ, 11 గం॥లకు సామూహిక శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ప్రతిఏటా భక్తులు చేసుకుంటారు.

ఏప్రిల్ 21 మంగళవారం వైశాఖ శుద్ధ తదియ నాటిని అక్షయ తృతీయ పర్వదినంగా జరుపుకుంటారు. అక్షయం అంటే క్షయం లేకుండుట. జీవితంలో అన్నిటినీ అక్షయం చేసే రోజు ఈ రోజు. ఈ రోజున చేసిన హోమాలు, దానాలు, పిత్రు దేవతలకూ, దేవతలకూ చేసిన పూజలు, క్షయం కాకుండా అక్షయంగా ఉంటాయని, అందుకే 'అక్షయతృతీయ' అనే పేరు వచ్చిందని శ్రీకృష్ణుడు, ధర్మరాజుకు

చెబుతాడు. తృతీయనాడు బంగారాన్ని తప్పకుండా కొనాలని తద్వారా



లక్ష్మీదేవిని తమ ఇంట్లో స్థిర వాసం ఉండేలా చేయాలని పెద్దలు చెబుతారు. బంగారం కొనుగోలు చేయలేనివారు లవణం కొనుగోలు చేయవచ్చు. ఈ రోజున విష్ణువును ప్రార్థిస్తే సకల సంపదలు చేకూరుతాయని పండితులు చెబుతారు. మనకి ఎప్పుడు ఏది కావాలో దానిని అందించి సకల శుభాలను చేకూర్చే శ్రీసద్గురుదేవుల పాదపూజ ఈ రోజున భక్తులు ఆశ్రమంలో జరుపుతారు.

ఏప్రిల్23, శనివారం - శ్రీకాళీవనాశ్రమంలో శ్రీ శంకర




జయంతినాడు శ్రీ సద్గురుమూర్తి వింశతి వార్షికోత్సవ సందర్భంగా సత్సంగము, శ్రీ సద్గురు పాదపూజా మహోత్సవము వైభవంగా జరుగుతాయి.

శ్రీ శంకర భగవత్పాదులవారి జన్మదినం మరపు రాని మహా పుణ్యదినం. కేరళలో కాలడిలో పూర్ణానది ఒడ్డున శివగురు, ఆర్యాంబ దంపతులు తిరుచూరు లోని వృషభాచలేశ్వర స్వామిని సంతానం కోసం ప్రార్థించగా తానే వారి గర్భాన జన్మిస్తానని చెప్పాడు. వారికి వైశాఖ శుద్ధ పంచమినాడు దివ్య తేజోకాంతులతో జన్మించిన పుత్రునికి "శంకరుడు" అని పేరు పెట్టుకున్నారు.



శ్రీశంకరులు తన ఎనిమిదవ ఏట పాండిత్యం సంపాదించి, పన్నెండేళ్ళకి సర్వ శాస్త్రాలు మథించి, పదునారవ ఏట భాష్యం వ్రాసి 32వ ఏట దేహత్యాగం చేశారు. దేశం నలుమూలలా తిరిగి శృంగేరి, ద్వారక, గోవర్ధన, జ్యోతిర్మఠము అను నాలుగు శంకర మఠాలు నిర్మించి, అద్వైత మత ప్రచారం చేసి, ప్రజలను మోక్షగాములుగా చేసిన జగద్గురువులు శ్రీ శంకరపాదాచార్యుల వారు.

# శ్రీబాబు దివ్యవాణి

సేకరణ - మురళి

(26-12-1976 న శ్రీబాబు దివ్యబోధామృతం)

శ్రీరామచంద్రుడు చక్కని ప్రవర్తన, రూపం కలవాడు. ఆర్తత్రాణ పరాయణుడు.శరణువేడిన వాడిని విడువనివాడు. రామదాసు ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయక ఓర్చి ఆ రాముడిని కొలిచి, గమ్యం చేరుకున్నాడు. మరణ వలయం నుండి మనలను రక్షించేది ఆ దివ్య నామమే! మనం ప్రపంచ విషయాదులలో పడి, ఆ నాగశయుని మరచాము.



భగవంతుడు చేసే పనికి మనం అర్థం తెలుసుకోలేము. నాగరికత బలిసి, నాగశయనుడిని మరచాము. తాము అనుకున్న కోరికలు తీరితే తిరుపతి వచ్చి మొక్కులు చెల్లిస్తామని అంటారు. కాని వారి కోరికలు తీరిన తరువాత ఆ మొక్కులు చెల్లించరు. కాని వడ్డీకాసుల వాడు, వేంకటేశ్వరుడు (మా బ్రదర్) వడ్డీతో సహా గుంజుతాడు.

రామదాసు మన ఆంధ్రదేశంలో జన్మించి, పరమాత్మని సగుణంగా చూసుకున్న పరమ భక్తాగ్రేసురుడు. శ్రీరామ దర్శనం దర్శనం అయ్యేవరకు ఒడ్డునపడ్డ చేపలాగ కొట్టుకున్నాడు. కారాగారంలో దర్శనం అయ్యాక అంతులేని ఆనందం పొందాడు.

గజేంద్రునికి దేహదారుఢ్యం ఉన్నంత వరకూ తనకేమీ పట్టనట్లే ఉన్నాడు. కానీ 'ఠావుల్‌దప్పె మూర్ఛవచ్చె' అన్నప్పుడు శ్రీమన్నారాయణుడు 'సిరికిం జెప్పడు, శంఖుచక్రముల్ చేదోయి సంధింపడు' అన్నట్లు తహతహలాడుతూ భక్తరక్షణకు బయలుదేరి వచ్చి, మకరని సంహరించి గజేంద్రుని రక్షించాడు. అట్టి ఆర్తత్రాణ పరాయణుడు శ్రీమన్నారాయణుడు!

# కల్పవృక్షం నీడలో ఉంటే?

- పాలూరి కాళీప్రసాద్

చిన్నప్పుడు చదువుకున్న కథ. బహుశః శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినది అనుకుంటా. ముందుగా ఆ కథ చెప్పుకుని తరువాత నా అనుభవంలోకి ఎలా వచ్చిందో చూద్దాం.

ఒక బాటసారి ఒక అడవిలో ఎంతో దూరం నుంచి నడచి వస్తూ అలసిపోయి ఒక చెట్టు నీడకు చేరాడు. అయితే ఆ చెట్టు కల్ప వృక్షం అని అతనికి తెలియదు. బాగా ఆకలితో ఉన్నాడేమో మనస్సులో 'తినడానికి ఏమైనా దొరికితే బాగుండు!'ననుకున్నాడు. వెంటనే అతని ముందు పంచభక్ష్య పరమాన్నాలతో విందు భోజనం ప్రత్యక్షమయింది. ఆవురావురుమంటూ తిన్నాడు.

విందారగించిన వాడికి ఆపుకోలేనంత నిద్ర ముంచుకొచ్చింది. 'ఇప్పుడు పడుకోవటానికి ఒక మంచం ఉంటే ఎంతబాగుండు!' అనుకున్నాడు. వెంటనే హంసతూలికా తల్పం ప్రత్యక్షమయింది. దాని మీద విశ్రమించిన అతనికి తన భార్య ప్రక్కనేఉండి కాళ్ళు వత్తుతూ 'తాంబూలం తినిపిస్తుంటే భలేగా ఉంటుంది కదా!' అన్న కోరిక కలిగింది. వెంటనే తాంబూలం పళ్ళెంతో అతని భార్య ప్రత్యక్షమయింది. ఇక మన వాడికి ఆలోచన మొదలయింది. 'ఉన్నట్టుండి ఇంత కారడవిలో ఈ విందు భోజనం, ఈ తల్పం, తన భార్య ప్రత్యక్షమవటమేమిటి? కొంపదీసి ఇదేదో భూతం కాదుకదా!' అనుకున్నాడు వెంటనే ఆ భార్య భూతంలా మారి పోయింది. 'అమ్మో! ఇప్పుడు ఇది నన్ను మ్రింగేస్తుందేమో!' అనుకున్నాడు. వెంటనే ఆ భూతం అతనిని మ్రింగేసింది.

నేను కూడా ఎన్నో జన్మల నుండి ఈ సంసారమనే అడవిలో పరిభ్రమిస్తూ చివరికి గురుదేవులైన 'సమర్థ సద్గురు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్' అనే కల్పవృక్షం నీడలోకి చేరాను. 2003లో ఆశ్రమంలో సహస్రచండి యాగం జరుగుతున్న రోజుల్లో అమెరికా నుండి వచ్చి కర్తలుగా యాగంలో సేవ చేసుకుంటున్న భక్తులను చూసి "ఆహా! నేను కూడా అమెరికా వెళ్ళి డబ్బులు సంపాదిస్తే ఇలాగ సేవ చేసుకోవచ్చు కదా!" అన్న ఆలోచన నాలో కలిగింది. వెనుకటికి ఒకడు డబ్బులు కావాలని తపస్సుచేసి, తీరా శివుడు ప్రత్యక్షం అయితే,

మా మేనమామ చెవులో వెంట్రుకలు మొలవాలని కోరినట్లే ఉంటాయి మన తెలివితేటలన్నీను. మనకు ఏది కావాలో అది కోరకుండా ఇలా డొంకతిరుగుడు వ్యవహారాలన్నీ చేస్తుంటాము.

ఆ మరునాడే "అమెరికా వెళ్ళాలి వెంటనే బయలుదేరి రమ్మని మా ఆఫీసు నుండి ఫోన్ వచ్చింది. హాయిగా ఇంత మహత్తర యాగాన్ని దర్శించి ఆనందిస్తుంటే మధ్యలో ఈ విఘ్నం ఏమిటని తిట్టుకున్నాను. కాని అది నా కోరికవల్లనే వచ్చిందని అప్పుడు గుర్తించలేక పోయాను. ఈ డొంకతిరుగుడు వ్యవహారంతో కొసరుకోరిక తీరినా, అసలుకోరిక తీరటానికి మరో పదిఏళ్ళు పట్టింది.

అలాగే 2005లో ఒకసారి ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తూ "మన దేశపు విమానంలో ప్రయాణం బాగానే ఉంది కాని, మనం రెండు వందల ఏళ్ళపాటు బ్రిటీషువారికి దాస్యం చేశాం కదా, ఒకసారి ఆ బ్రిటీష్ ఎయిర్వేస్ విమానం ఎక్కి వాళ్ళతో సేవలు చేయించుకుంటే ఎలా ఉంటుంది!" అనే ఆలోచన కలిగింది. నెలరోజులు తిరక్కుండానే మా ఆఫీస్‌వాళ్ళు బ్రిటీష్ ఎయిర్వేస్ విమానంలో నన్ను అమెరికా పంపారు. "అమ్మో! ఇలా అనుకున్నవన్నీ జరిగిపోతుంటే ప్రమాదం సుమా! ఇక నుంచి కోరికలను అదుపులో పెట్టుకోవాలి" అనుకున్నాను.

అయితే పైన చెప్పుకున్న కథలో మనం చూస్తే కల్పవృక్షం నీడలో ఉన్నవారు తమ కోరికలనే కాక, ఆలోచనలను, భయాలను, సందేహాలను అన్నిటినీ అదుపులో పెట్టుకోవాలి. అలాంటి కనువిప్పు కలిగించే సంఘటన 2013 సెప్టెంబర్‌లో జరిగింది.

మనదేశంలోని హొటల్స్‌లో 'ప్లేటులో చేతులు కడగరాదు' అన్న బోర్డులు ఎంత సహజమో, అమెరికాలో హొటల్స్‌లో తినే పదార్థాలు గొంతుకు అడ్డుపడితే ఏమి చెయ్యాలో సూచించే బోర్డులు అంత సహజంగా ఉంటాయి. ఒకరోజు ఆఫీసు నుండి ఇంటికి వస్తూ బస్సులో ఉండగా ఈ బోర్డు గుర్తుకు వచ్చి, "ఈ అమెరికావాళ్ళు అన్నిటికి అతిగా భయపడతారు. మనదేశంలో ఆహారం గొంతుకు అడ్డుపడి చనిపోయిన వాడిని ఒక్కడిని కూడా చూడలేదు. అంత చిన్న విషయాన్ని వీళ్ళు ఇంత పెద్దదిగా చేస్తున్నారు" అని నవ్వుకున్నాను.

(తరువాయి భాగం కోసం 28వ పేజీ చూడండి)

# సద్గురు శ్రీ యాత్రాదర్శన్

(గత సంచిక తరువాయి) -డా॥ సుధ

మధ్యాహ్నం భోజనానంతరం వద్ద **Mc.Leod Gunj** ధర్మశాలకు వెళ్లాం. ఉన్నతమైన హిమాలయాల దగ్గరగా ఉన్న బౌద్ధుల నిలయం. దలైలమా ఉండే ప్రదేశం. బౌద్ధ ఆరామం వెళ్ళాము. టిబెట్ దేశం వెళ్ళకుండానే, టిబెట్ చూసినట్లు ఉంది. ప్రకృతి సౌందర్య నిలయమైన హిమవన్నగరం. బౌద్ధుల యొక్క ఆచారాలు, ప్రార్థనలు, వారు భగవంతుని కొలిచే విధానం, భాష బొత్తిగా అర్థం కాకపోయినా, బౌద్ధ ఆరామంలో ప్రవేశించాక, సర్వవ్యాపకమైన ఆ శక్తి ప్రసరణచేత పులకరింత కలిగింది. రాత్రి 9గం.లకు హొటల్‌కు చేరి విశ్రాంతి తీసుకున్నాము.

14-5-2014 - శ్రీ గురుపూర్ణిమ.

ఉదయం 5గం.లకు ప్రార్థన, తదుపరి గురుపూజ. అమ్మ సన్నిధిలో మనస్ఫూర్తిగా పూజ చేసుకున్నాము. ఫలహారం చేసి, గంట ప్రయాణం చేసి సిద్ధబారి చేరుకున్నాము. చాలా ఎత్తైన ప్రదేశం. చిన్మయ సమాధి దర్శించాము. మన బృందావనంలో శ్రీబాబు సన్నిధిలో కూర్చుంటే ఎలా ఉంటుందో, అటువంటి భావన కలిగింది. ఆ అనుకూల స్పందనలతో నిశ్చలంగా కూర్చుని ఎంతసేపైనా ధ్యానం చేసుకోవచ్చు. చక్కని ఉద్యాన వనం. హిమాలయాల దృశ్యం కనులకు, మనస్సుకి ఇంపుగా ఉన్నది. దగ్గరలోని శ్రీరాముని ఆలయం చూశాము.

తిరిగి చాముండ చేరుకున్నాము. భోజనానంతరం జమ్ము (కాత్రా)కి బయలుదేరాము. కాత్రా నుండి కొండపైన వైష్ణవిదేవి వద్దకు 14కి.మీ దూరం ఉంటుంది.

15-5-2014 - ఉదయం 7గం.లకు యాత్ర చిట్టీ తీసుకుని బాణగంగ వరకు ఆటోలో వెళ్ళి, అక్కడి నుండి డోలీలో (త్రికూట పర్వతం) కొండపైకి వెళ్ళాము. 3 1/2గంటల సమయం పట్టింది. భక్తుల యొక్క సంకీర్తనలు, 'జైమాతాజీ' అనే నామ తరంగాలతో నిండిన పవిత్ర వాతావరణం. ప్రకృతి సౌందర్యంతో కలిసి ఒక దివ్య అనుభూతి కలిగింది. ఎండ ఉండటం వలన చలిలేదు. రద్దీ లేకపోవటం వలన వైష్ణవీమాత దర్శనం కొంతసేపు దేవి సన్నిధిలో నిలబడి చేసుకోగలిగాము.

మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతీ పిండి రూపంలో సత్వ, రజస్తమో గుణాలకు ప్రతీకలుగా ఉన్నారు. డోలీలో తిరిగి వచ్చేటప్పుడు మాతాజీ ఆ తల్లి రూపంలో డోలీ ఆపి దర్శన, స్పర్శనములను ఇచ్చారు. అమ్మ యొక్క దర్శనం ఆ విధంగా చేసుకుని తృప్తిగా క్రిందిగి వచ్చాం. సాయంత్రం త్వరగా భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నాము.

- సశేషం

---

## ('కల్పవక్షం నీడలో ఉంటే' - 26వ పేజీ తరువాయి భాగం)

రెండు మూడు రోజుల తరువాత ఒకరాత్రి అలవాటు ప్రకారం విటమిన్ మాత్ర వేసుకుని నీళ్ళు త్రాగేలోపు, ఆ మాత్ర గొంతులో అడ్డం తిరిగింది. అసలు నీళ్ళు మ్రింగటానికి కూడా అవకాశం లేదు. క్షణంలో శ్వాస అందటం ఆగిపోయింది. కళ్ళు బైర్లుగమ్ముతున్నాయి. ఎంత ప్రయత్నించినా ఆ మాత్ర లోపలికి వెళ్ళలేదు, బయటకి రాదు. శ్వాస ఆడక పోవటంతో మెల్లగా స్పృహ తప్పుతోంది. “ఈ జీవితానికి అంతం ఇలా నిర్ణయించావా ప్రభూ!” అని ఒక్కసారి గురుదేవులను స్మరించి, ఇక అన్ని ప్రయత్నాలు విరమించి, ప్రశాంతంగా మరణించటానికి సిద్ధ పడ్డాను. అప్పుడు “అంత తేలిగ్గా చేతులు ఎత్తేస్తే ఎలా? బ్రతకటానికి ప్రయత్నించు” అన్న అంతర్వాణి వినబడటం, ఇందాక చెప్పుకొన్న బోర్డు మీద ఉండే సూచనలు గుర్తుకురావటం ఒకేసారి జరిగాయి. వెంటనే మళ్ళీ స్పృహ వచ్చింది. అప్పుడు బాగా ముందుకు వంగి పొట్టమీద చేతులతో నొక్కుకుంటే ఆ మాత్ర బయటపడింది.

ఇలా పైన చెప్పుకున్న కథలోని కల్పవృక్షం వలె శ్రీ గురుదేవులు సాక్షీమాత్రంగా ఉంటూ మనందరి జీవితాలను నడిపిస్తున్నారు. అయితే తాను, కల్పవృక్షం నీడలో ఉన్నానని గ్రహించని ఆ బాటసారి మొదట్లో ఆనందాన్ని పొందినా, తరువాత నాశనం అయిపోయాడు. కానీ ఆ విషయాన్ని గుర్తించినవారు సదా మంచినే కోరుకుంటూ, మంచి ఆలచనలే చేస్తూ, మంచినే చూస్తూ తమ జీవితాన్ని సరిదిద్దుకో గలుగుతారు. ఆశ్రమ ప్రార్థనలోని సారాంశం ఇదే! ఈ విషయాన్ని ఎప్పుడైనా మరచిపోయి తప్పుడు ఆలోచనలు చేసినా, శ్రీగురుదేవులు దయామయులై మనకు బుద్ధి తెప్పించి మళ్ళీ మంచి మార్గానికి మరలుస్తారు.

# నరహరి సోనార్

సంకలనం - దేవరకొండ శేషగిరిరావు

సుమారు 700సంవత్సరాల క్రితం దేవగిరి రాజ్యాన్ని లేదా దేవగఢ్‌ని రామదేవరావు పాలించిన కాలంలో, ఒక గ్రామంలో నరహరి అనే స్వర్ణకారుడు జన్మించాడు. అక్కడున్న భక్తులందరూ పాండురంగణ్ణి సేవిస్తుంటే, ఇతడు మాత్రం శివ భక్తుడు. శివకేశవుల మధ్య భేదాన్ని చూసేవాడు. శివుడే పరమ దైవమని ప్రగాఢంగా నమ్మేవాడు. శివుని కంటె విష్ణువు తక్కువ అని అభిప్రాయం కూడా ఇతనికి ఉండేది.

ఒకనాడు ఒక షావుకారు బంగారుపని చేసే నరహరి కొట్టుకు వచ్చాడు. విఠలునికి ఒక వెండి కర్గోటా (అంటే పటకా) చేయించాలని వచ్చాడు. 'తప్పక చేస్తాను! కాని పాండురంగడి ఆలయానికి మటుకు రాను' అన్నాడు. 'విష్ణు స్మరణగాని, విష్ణుదర్శనం కాని చేయను. మీరు కొలతలు తెచ్చి ఇస్తే నేను చేస్తాను' అన్నాడు.

షావుకారు కొలతలు తెచ్చాడు. వస్తువు తయారయింది. విగ్రహం మీద ఉంచగా చాలా బిగుతుగా ఉంది. తిరిగి నరహరి దగ్గరకు తీసుకు వచ్చి 'దీన్ని కాస్త వదులుగా చెయ్యి' అన్నాడు. 'ఒక్కసారి ఆలయానికి వచ్చి కొలతలు తీసుకుని వచ్చి చేస్తే మాటిమాటికి మార్చే అవసరం ఉండదుగా' అని కూడా అన్నాడు షావుకారు. 'నేను ఆలయానికి వచ్చినా, ఆ మూర్తిని మాత్రం చూడను' అన్నాడు నరహరి. 'అయితే మూర్తిని చూడకుండా, తడుముతూ కొలతలు తీసుకో' అన్నాడు షావుకారు. దానికి అంగీకరించాడు నరహరి.

కళ్ళకు గంతలుకట్టి నరహరిని ఆలయానికి తీసుకువెళ్ళాడు షావుకారు. నరహరి కొలతలు తీసుకోబోతున్నాడు. విగ్రహాన్ని తడిమి చూస్తుంటే ఆది శంకరుని విగ్రహంలా అనుభూతిని పొందాడు నరహరి. ఇదు ముఖాలూ, జటాజూటము ఉన్న విగ్రహం వలె అనుభూతి చెందాడు. ఇది కచ్చితంగా శివుని విగ్రహమే, విష్ణువు విగ్రహం కాదనే నిశ్చయానికి వచ్చి, గంతలు విప్పుకుని కళ్ళారా చూశాడు! అక్కడ ఉన్న మూర్తి, నిలబడిన విష్ణు విగ్రహం! నిలబడిన మూర్తిని 'స్థానకమూర్తి' అని శిల్ప పరిభాషలో అంటారు. ఏమిటీమాయ! తన భావనలో లోపమా? శివుడే విష్ణువుగా కనబడుతున్నాడా? విష్ణువే తనను చూపడానికి శివునిగా కనబడ్డాడా?

తన భావనలో తప్పులేదని, ఇతడు శంకరుడే అని నిశ్చయించుకున్నాడు. ఎన్ని సార్లు గంతలు కట్టుకుని తాకినా, అది శంకరుని విగ్రహంగానే అనుభూతిని చెందాడు. గంతలు విప్పిన ప్రతిసారి అది విష్ణువిగ్రహంగానే గోచరిస్తోంది.

అప్పుడు నరహరికి జ్ఞానోదయం అయింది. "నన్ను నీ వానిగా స్వీకరించవయ్యా!" అని ఎలుగెత్తి ప్రార్థించి, సాష్టాంగ నమస్కారం చేశాడు ఆ మందస్మిత వదనారవిందానికి.

నరహరి గైచీనాథ్ యొక్క శిష్యుడు. జ్ఞానేశ్వర్ సహాయంతో ఆధ్యాత్మిక శిఖరాలను అందుకున్నాడు. భేదభావాన్ని సంపూర్తిగా మనస్సు నుండి తుడిచివేశాడు. అతనికి ప్రపంచం అంతా ఒక గోడపై చిత్రించిన చిత్రంలా గోచరించింది.

తన వృత్తియే దేవాలయంగాను, చేత ధరించిన సుత్తి మొదలైన పనిముట్లు రాగద్వేషాలను అణిచే సాధనాలుగాను, బంగారమే తన ఆత్మగాను, శుద్ధి చేసే ద్రావకమే పరమాత్మగాను - నరహరికి కనిపించేవి. నరహరి వ్రాసిన అభంగాలు కూడా ఎంతో ప్రచారానికి వచ్చాయి.

ఇలా నరహరి పాండురంగ నామభజనతో జ్ఞానదేవాదుల సరసన చేరాడు. అతడు జ్ఞానదేవ బృందంతో కలిసి తీర్థయాత్రలు చేశాడు. జ్ఞానేశ్వర్ మహాసమాధి సమయంలో నరహరి కూడా ఉన్నాడు. 1313వ సంవత్సరంలో నరహరి సిద్ధిని పొందాడు.

### శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, హైదరాబాద్ వాస్తవ్యులు అయిన శ్రీమతి నేలభొట్ల వెంకటసుబ్బలక్ష్మిగారు (కుట్టిగారి భార్య) 11-3-2015 బుధవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 61 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

# మొదట హృదయాన్ని పవిత్రం చేసుకోండి!

(శ్రీరామకృష్ణులు చెప్పిన గూఢార్థ కథల నుండి)

నరేంద్రుడు (వివేకానందుడు) ఒకసారి ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో కలిసి, దక్షిణేశ్వరానికి వెళ్ళాడు. ఆ యువకులు బ్రహ్మ సమాజానికి చెందినవాళ్ళు. అప్పుడు నరేంద్రుడి వయస్సు 19సంవత్సరాలు. ఆ రోజు అంతా పూర్తిగా వాళ్ళు గురుదేవుల వద్దనే గడిపారు.

మరునాడు ఉదయం ఆ యువకులు గంగలో స్నానం చేసి, పంచవటిలో కొంచెంసేపు ధ్యానం చేసి, గురుదేవుల (రామకృష్ణుల) గదిలోకి వచ్చి కూర్చున్నారు. అప్పుడు ఆయన వాళ్ళతో "నాయనా! మొదట మీ హృదయాన్ని పరిశుద్ధం చేసుకొని, భగవంతుణ్ణి హృదయంలో ప్రతిష్ఠించుకోండి. తరువాత మీరు కోరినన్ని ఉపన్యాసాలు ఇవ్వండి. లేకపోతే మీరు చెప్పే మాటలన్నీ కేవలం శంఖం ఊది, గంటలుకొట్టే గందరగోళం అవుతుంది. ఒక కథ చెబుతాను వినండి!"

"ఒక ఊళ్ళో పద్మలోచనుడు అనే యువకుడున్నాడు. ఆ ఊరి వారంతా 'పద్దయ్య' అని వాడిని ముద్దుగా పిలుచుకునేవారు. ఆ ఊళ్ళోనే ఒక పాడుపడిన దేవాలయం ఉంది. అది శిథిలమైనందున దాని గోడల మీద రావి మొదలైన చెట్టు చేమలు పెరిగాయి. ఆ గుళ్ళో విగ్రహం లేకపోగా, నిండా చెత్తాచెదారం పేరుకుపోయింది. అది ఒక గబ్బిలాల కొంపలాగ తయారయింది. అందువల్ల గ్రామస్థులు ఆ దేవాలయానికి వెళ్ళడం మానుకున్నారు."

"ఇలా ఉండగా ఒకరోజు సాయంత్రం అకస్మాత్తుగా ఆ గుళ్ళో నుండి జేగంటల శబ్దము, శంఖారావము వినవచ్చాయి. ఎవరో ఒక మహాత్ముడు వచ్చి గుడిని బాగుచేసి, ప్రదోషకాలంలో హారతి ఇస్తున్నాడు అనుకుని గ్రామస్థులు అక్కడకి వెళ్ళారు. శబ్దాలు వినబడటమేకాని, గుడి పరిస్థితి ఎప్పటిలాగే ఉంది. వాళ్ళల్లో ఒకడు ముందుకుపోయి లోపల ఏం జరుగుతోందా అని తలుపు సందుల్లో నుంచి చూశాడు. లోపల పద్దయ్య గోడకు ఆనుకుని బిగ్గరగా శంఖం ఊదటం, గంటలు కొట్టడం కనిపించింది. లోపల విగ్రహం లేదు. నేల పరిశుభ్రం చేయబడలేదు. ఆ

విషయం తెలిసి గ్రామస్థులు తలుపు తెరిచి, పద్దయ్యను 'ఇది ఏమిర మందమతీ? విగ్రహము నెలకొల్పవు, మలినమునా తొలగించవు! ఆలయమున శంఖము ఊదుచూ, గగ్గోలు కావించుదువు!' అన్నారు.

"ఆలయంలో గబ్బిలాలు కీకురు బాకురుమంటూ, చికాకు పరుస్తున్నాయి. చుట్టూ చెత్తాచెదారం, గబ్బిలాల రెట్టలు నిండిన గర్భాలయంలోకి పవిత్రమైన దేవతా విగ్రహాన్ని ఎవరూ తీసుకురారు.

అలాగే నీకు దైవసాక్షాత్కారం కావాలంటే, హృదయ మందిరంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠించుకోవాలంటే, మొదట నీ హృదయాన్ని పవిత్రం చేసుకో! అప్పుడు ఆ పవిత్రమైన హృదయ మందిరంలో దేవుడు ప్రతిష్ఠితం అవుతాడు. అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, మనస్సు ఒకటి - మొత్తం పదుకొండు వీటినే గబ్బిలాలు అని చెప్పుకోవచ్చు."

ఇలా కథను ముగిస్తూ శ్రీరామకృష్ణులు, ఆ బ్రహ్మసమాజ యువకులతో "నాయనా! మొదట మీరు మీ హృదయ మందిరాలను వివేకవైరాగ్యాలతో పరిశుభ్రం చేసుకోండి! వివేకవైరాగ్యాలు లేకుండా ఇచ్చే ఉపన్యాసాల వల్ల ప్రయోజనం లేదు. మొదట దేవుణ్ణి హృదయంలో ప్రతిష్ఠించుకున్న తరువాత మీ ఇష్టం వచ్చినన్ని ఉపన్యాసాలు ఇవ్వండి! మీ హృదయంలోని అట్టడుగు లోతుకు మునిగితే అక్కడ రాశులుగా పోసి ఉన్న మణులు, ముత్యాలను (ఆధ్యాత్మిక అనుభవాలను) మీరు పొందవచ్చు." అని హెచ్చరించారు.

## ఉచిత వేసవి శిక్షణా తరగతులు

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో 1-5-2015 నుండి 31-5-2015 వరకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయి. భగవద్గీత, ఉపనిషత్తులు, ప్రార్థనాంశాలు బోధిస్తారు. ఆసక్తిగల వారు తమ చిన్నారులను తీసుకుని వచ్చి ఈ అవకాశం సద్వినియోగ పరచుకోగలరని తెలియబరచటమైనది!

# ఇంద్రద్యుమ్నుడు - కామేశ్వరీ ప్రసాద

ఆ మహారాజు మహర్షి యొక్క శాపం విని, నారాయణ ధ్యాన నిమగ్నుడైపోయాడు. వెంటనే ఒక అరణ్యంలో గజ (ఏనుగు) జన్మను ఎత్తాడు. పదిలక్షల కోట్ల ఏనుగులకు రాజు అయ్యాడు. పూర్వజన్మ స్మృతి కలిగియుండి, మహా భక్తుడయ్యాడు. 'గజేంద్రుడు'గా పేరును పొంది, పరివార సమేతంగా ఆ వనంలో స్వేచ్ఛగా తిరుగుతూ సుఖంగా కాలం గడుపుతున్నాడు.

ఒకరోజు ఎండలో తిరిగి తిరిగి అలసిపోయి, ఒక చెరువు దగ్గరకు వచ్చి, దాహంతో నోరెండిపోతుండగా కాసిని మంచినీళ్ళు త్రాగటానికి ఆ గజేంద్రుడు ఆ కాసారంలో దిగాడు. ఆ నీటిలో మునిగి తన పరివారంతో ఆడే సమయంలో గంజేద్రుడి కాలు ఒక మొసలి పట్టుకుంది. విపరీతమైన బాధ కలుగుతోంది. భరించలేక పోతున్నాడు. అతని భార్యలు, పరివారం అంతా కూడా అది చూసికూడా ఏమీ చేయలేక ఒంటరిగా వదిలివేసి, ఎవరిదారిన వారు తిరిగి వెళ్ళిపోయారు.

అప్పుడు ఆ గజరాజు అనుభవిస్తున్న బాధ వర్ణనాతీతం! అతడి మనస్సులో అనేక ఆలోచనలు తిరుగుతున్నాయి. 'అయ్యో! వనంలో హాయిగా నా పరివారంతో ఆనందాన్ని అనుభవిస్తున్న నేను, మంచినీళ్ళ కోసం వచ్చి ఇక్కడ ఇరుక్కున్నానే! ఈ మొసలి నన్నుపట్టి పీడిస్తోంది. నా వారెవరూ ఒక్కరూ నాకు సహాయపడలేదే! వారందరినీ నేను ఎంత ప్రేమగా చూశాను? ఈ సంసారం ఇంతేనా? ఎవరిదారి వారిదేనా? ఇదంతా హుళక్కేనా?' అని బాధపడుతూ ఎలాగైనా ఆ మొసలి బారి నుంచి బయట పడాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

తన బలంతో ఎలాగైనా వడ్డునపడాలి అని గట్టిపట్టుదలతో ప్రయత్నించినా తిరిగి ఆ మొసలి గజేంద్రుని కాలుపట్టుకుని కాసారంలోకి తీసుకుపోయింది.

- సశేషం

# సత్సంగామృతం

- మురళీ

అందరిలో ప్రకాశించే ఆత్మ ఒక్కటే. మనకు అవసరం ఉన్నా లేకపోయినా, అన్నీ మనకే కావాలని అన్ని విషయాలలో తలదూర్చటం, తలనొప్పులు తెచ్చుకోవటం, సమయం వృథా చేసుకోవటం. అదే జన్మ దోషం. మనస్సు అందిరిలో లోపాలను ఎంచుతుంది. తనలోని దోషం గుర్తించదు. భగవన్నామం భవరోగం నుండి తరింపజేయటమే కాక, దేహానికి వచ్చిన రోగాన్ని కూడా పోగొడుతుంది.

రావణ సంహారం జరిగిన తరువాత శ్రీరామచంద్రుడు అయోధ్యకు వచ్చి సేవకులందరికీ బహుమతులు పంచుతున్న సమయంలో ఆంజనేయస్వామి ప్రభువు పాదాల దగ్గరే కూర్చున్నాడు. అందరికీ పంచటం అయ్యాక, లేచి నిలబడి, మారుతిని మనసారా కౌగలించుకున్నాడట, అదే రాముడు మారుతికి ఇచ్చిన బహుమతి. సీతాదేవి రామ ప్రభువుని 'ఆంజనేయునికి ఏ బహుమతి ఇవ్వలేదే'మని అడిగితే, 'నీ పుత్రుడే కదా! అదేదో నువ్వే ఇవ్వు అన్నాడు. వెంటనే సీతాదేవి తన మెడలోని ముత్యాలహారాన్ని హనుమ మెడలో వేసింది.



అప్పుడు హనుమ దూరంగా వెళ్ళి ఒక మూల కూర్చుని, ఆ దండలోని ముత్యాలను ఒక్కొక్కదానిని కొరికి పారవేస్తున్నాడు. అది చూసి సీతాదేవికి కోపం వచ్చింది. ఆంజనేయుని ఎందుకలా చేస్తున్నావని అడిగింది. "అమ్మా! ఈ ముత్యాలలో నా సీతారాములున్నారేమో అని చూస్తున్నాను" అని బదులిచ్చాడు. వెంటనే సీతాదేవి వారెక్కడ ఉన్నారో చూపగలవా అనగానే హనుమ తన గుండెలు చీల్చి చూపించాడు.

అదీ భక్తి అంటే!

ఏది ఎంతవరకు ఉండాలో అంతవరకే. లోకాభిరామాయణం వదలాలి. భగవన్నామం చేయాలి. విశ్వాసం, నమ్మిక ఎక్కడ ఉంటుందో అక్కడ రక్షణ ఉంటుంది. మన గురుదేవులు ఉండగా మనకెందుకు భయం? నామం ఎప్పుడు చేయాలి? నిన్ను నువ్వు మరచిపోయేంత వరకూ నామం చెయ్యాల్సిందే. నామస్మరణ చేయటానికి ఏ నియమాలు అవసరం లేదు.

అగ్గిపెట్టె నీ జేబులో ఉంటే వెలుగురాదు. అగ్గిపుల్లను పెట్టెతో రాపిడిపెడితే మంట వస్తుంది. వెలుగు వస్తుంది. చీకటి హరించుకు పోతుంది. చీకటి, వెలుగులో లయించి పోతుంది. ఒక వ్యక్తి నడుస్తూ ఉంటే, తన నీడ తన కంటె ముందు వెళ్ళటం గమనించి, దానిని పట్టుకోవడానికి, త్రొక్కడానికి ప్రయత్నించి విఫలమయ్యాడట. వీడి శ్రమ చూసిన పెద్ద మనిషి విషయం అడిగి తెలుసుకుని, "నాయనా! నువ్వు వెనక్కి తిరిగి సూర్యుని వైపు నడుస్తూంటే ఆ నీడ నీ వెనుకనే వస్తుంది" అని చెప్పాడట. మనకి తెలియని విషయాలు తెలియజేసి, సరియైన మార్గంలో నడిపించి, సదా రక్షణచేసేవారే గురుదేవులు. ఆ నీడే మాయ.

ఒక వ్యక్తి రోడ్డున వెళ్తూ మలం త్రొక్కాడు. ఆ మైల వదిలించు కోవాలంటే వెంటనే కాళ్ళు కడుగుకుంటే సరిపోతుంది. వాడు కాళ్ళు కడుగుకోవటం మాని, ఈ మైల ఎవరి వలన వచ్చింది? వాళ్ళు ఏమి తింటే వచ్చింది? తిన్న వస్తువు ఎవరు తయారుచేశారు? వంటి విషయాలు గురించి విచారణ మొదలు పెట్టాడు. ఈ విచారణ అవసరమా?

అజ్ఞానులమై భగవంతుని, భగవన్నామాన్ని మరచి, అనవసర విషయాల గురించి ఆలోచించి సమయాన్ని వృథా చేసుకునే వారి గురించి మహాత్ములు వాపోతున్నారు. గురువాజ్ఞానుసారం భగవన్నామం చేయటం మొదలుపెడితే అన్నీ సవ్యంగా జరుగుతాయి. అట్టి శ్రీగురు పాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# హనుమద్వైభవము

(గత సంచిక తరువాయి) - సుషమ్నా ప్రసాద

ఇక రామ రావణ మహాసంగ్రామంలో ధూమ్రాది రాక్షసులను సంహరించటంలో మారుతి బలపరాక్రమములు, ధైర్య సాహసాలు ఋజువవుతాయి. కుంభకర్ణాది రాక్షసులు విజృంభించినప్పుడు, వానరసేన భీతిల్లి పలాయనం చిత్తగించటానికి సిద్ధమవగా, వీర హనుమాన్ సేనా నాయకుడిగా వారిని ఉత్తేజ పరచి, శత్రువులపై విజృంభించేటట్లు చేశాడు. రణరంగంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు సుషేణుడు సంజీవిని తెస్తే, లక్ష్మణుడు మూర్ఛ నుండి తెప్పరిల్లుతాడు కాని, సంజీవిని వృక్షాన్ని



తెల్లవారేలోపు తీసుకు రావాలన్నాడు. వెంటనే వాయు వేగంతో హనుమంతుడు సంజీవిని పర్వతం దగ్గరకు వెళ్ళాడు. కాని ఆ వృక్షసముహంలో సంజీవిని వృక్షమేదో తెలియక తికమక పడ్డాడు. వెంటనే మహాబలుడైన రామభక్త హనుమాన్ ఎవరికీ సాధ్యం కాని, మహా కార్యాన్ని నిర్వహించాడు. ఆ పర్వతాన్నే , సుషేణుడి వద్దకు మోసుకువచ్చి, లక్ష్మణుని రక్షించటానికి, శ్రీరాముని సంతోషింప జేయటానికి సావకాశం కల్పించాడు.

స్వామి సేవాపరాయణుడై, దాసానుదాసుడై, నిరంతరము సీతా రాములను సేవించటమే తన జీవితధ్యేయంగా భావించి, తరించిన రామభక్త హనుమాన్ మనందరికి ఆదర్శప్రాయుడు, ఆరాధ్యదైవము. శ్రీరామచంద్రుడు, 'తన భక్తుడే తన కన్న మిన్న' అని సూచిస్తున్నట్లు, రామాలయాల కన్నా, ఆంజనేయస్వామి ఆలయాలే అడుగడుగునా వెలిశాయి.

యత్ర యత్ర రఘునాధ కీర్తనమ్ తత్ర తత్ర కృతమస్త కాంజలిమ్।
బాష్పవారి పరిపూర్ణ లోచనమ్ మారుతిమ్ నమత రాక్షసాంతకమ్ ॥

# సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర

- విజయేశ్వరానంద ప్రసాద్

## నింద్రకొలను డాక్టరుగారితో శ్రీబాబు

వెంకటరాజుగారికి వృత్తిమీద కూడా ధ్యాస ఉండేదికాదు. వివాహం చేసుకోకుండా ఏ హిమాలయాలకో వెళ్ళి తపోమయ జీవనం గడపాలని బాగా ఉవ్విళ్ళూరేవారు. కాని వివాహం చేసుకుని ఆదర్శ రాజయోగిగా జీవించమని శ్రీబాబు వారికి చెప్పారు. "సంసారమనే మహా సంగ్రామంలో ఎదుర్కొనే కామ క్రోధాది అరిషడ్వర్గాలతోను, రాగద్వేష, సుఖ దుఃఖ, మానావమానాది ద్వంద్వ మహాశత్రువులతో పోరాడటానికి, గృహస్థాశ్రమం కోటవంటిది. ఆ కోటలో ఉండి చేసే పోరాటం చాలా నిరపాయ



మైనది. కాని బ్రహ్మచర్యమో, సన్యాసమో అవలంబించటం అంటే కోట బయటకు వచ్చి శత్రువులతో పోరాడటం వంటిది. అతి ప్రమాదకరము" అని బోధించారు. ఆ పరమ గురుప్రబోధాన్ని దైవాజ్ఞగా స్వీకరించి, వెంకటరాజుగారు వివాహం చేసుకున్నారు. శ్రీబాబు ఆదేశాన్ననుసరించి, గొల్లపాలెంలో కాపురం పెట్టారు.

కాని అనతికాలంలోనే భార్య గతించింది. రాజుగారికి ఈ సంఘటన దుఃఖ కారణం కాకపోగా, బంధ విముక్తిగా తోచింది. ఇతోధికంగా ధ్యానాదులకు అవకాశం కలిగింది. ఎన్నో దివ్యానుభవాలను, దర్శనాలను పొందారు. కాని, శ్రీబాబు వారిని ద్వితీయ వివాహం చేసుకోమని, పెదనింద్రకొలనులో కాపురం పెట్టి, వైద్యవృత్తిని కొనసాగిస్తూ, అక్కడ భక్తులకు సేవ చేసుకుంటూ, అందరిలో భగవంతుణ్ణి దర్శిస్తూ కాలం గడపమని ఆదేశించారు.

అది వారి మనస్సుకు తీవ్ర అఘాతాన్ని కలిగించినా, గురు వాక్యమే వేదవాక్యమని, అదే తమకు పరమ శ్రేయోదాయకమని,

నిశ్చయించుకుని, వెంకటరాజుగారు పెదనింద్రకొలను వచ్చి, అక్కడ కాపురం పెట్టి, వైద్యవృత్తిని కొనసాగించారు. గురుదేవులు చెప్పిన దానిని సంశయ రహితుడై ఆచరించి, ఎన్ని విషపరిణామాలు కలిగినా చలించక స్థిరంగా నిలిచిన భక్తునికి గురుపాద సన్నిధిలో శాశ్వత స్థానం లభిస్తుంది.

అప్పటి నుండి వారికి శ్రీబాబు భక్తులు చాలామంది పరిచయం అయ్యారు. అందరూ వారిని 'నింద్రకొలను డాక్టరుగారు' అని పిలిచే వారు. అభిమానులు 'గురువుగారు' అనేవారు. కాని డాక్టరుగారు తాము 'గురువు' అని పిలిపించుకోవటానికి ఏమాత్రం ఇష్టపడేవారు కాదు. అందరితోను వారు "మనందరికి పరమ గురువులు, ప్రత్యక్ష పరమేశ్వర స్వరూపులు అయిన అవతార పురుషులు శ్రీబాబూజీ మహరాజ్. వారు కలియుగంలో అవతరించిన శ్రీరామచంద్రులే. వారి దివ్యచరణార విందాలను మనమందరం విశ్వసించి, సేవించుకునే గొప్ప అవకాశం లభించింది. ఈ అవకాశాన్ని ఎవరూ జారవిడుచుకోకండి. దానిని వదులుకుంటే, మళ్ళీ ఎన్ని జన్మలెత్తినా అది లభించేది కాదు"అని ప్రబోధించి, హెచ్చరించి ఎందరెందరికో శ్రీబాబు చరణ సమాశ్రయ భాగ్యాన్ని ప్రసాదించారు.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, హైదరాబాద్ వాస్తవ్యులు అయిన వారణాసి భానుప్రసాద్ 23-2-2015 బుధవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 49 సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

-గత సంచిక తరువాయి

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

జబ్ మైథా తబ్ గురు నహీ, అబ్ గురూహైఁ హమ్ నాహీ ।
ప్రేమగలీ అతి సంకరీ తామే దో న సమాహీ ॥

" 'నేను' అనే అహంకారం ఉన్నంత వరకూ గురు సాన్నిధ్యం లభించలేదు. గురువు లభించాడు. 'నేను' అనే అహంకారం అదృశ్యమైంది. ప్రేమ మార్గం సంకుచితమైనది. అహంకారం, భగవంతుడు ఈ రెండూ ఒక మార్గంలో ఉండలేవు. ఏదో ఒక్కటే ఉంటుంది."




ఒకనాటి రాత్రి కబీర్‌దాస్ ఇంటికి కొందరు సాధు మహాత్ములు వచ్చారు. వారు తన గృహాన్ని పావనం చేసినందుకు కబీర్ అమితానందం పొందాడు. వారి పవిత్ర పాదాలను కడిగి ఆ పవిత్ర జలాన్ని తన శిరస్సుపై చల్లుకొన్నాడు. భార్యను పిలిచి వారికి వంట చేయమని చెప్పాడు.

భార్య ఆలోచించింది. ఇంట్లో సరుకులు లేవు. చేతిలో పైసాలేదు. ఇంతమంది మహాత్ములకు వంట చేయటం ఎలా? భర్తకు చెబుదామని చూసింది. మహాత్ముల సన్నిధిలో రామనామామృతాన్ని పానం చేస్తున్న కబీర్‌ను చూసింది. భర్తను పిలవటం ఇష్టం లేక, తానే సామాన్లు తేవటానికి కొట్టుకి వెళ్ళింది. ఆ కొట్టు యజమాని తులసీసేఠ్. ఆయనతో "ఏమండీ! నేను కబీర్‌దాస్ భార్యను. ఈనాడు మా ఇంటికి సాధు మహాత్ములు వచ్చారు. వారికి ఆతిధ్యమివ్వాలి. మీరు సరుకులు అప్పగా ఇవ్వండి. దయచేసి ఈ సహాయం చేయండి. మీకు జీవితాంతం ఋణపడి ఉంటాము." అని ప్రాధేయ పడింది.

తులసీసేఠ్ చూశాడు. లోయీ సౌందర్యవతి. ఆమె రూప లావణ్యాలు అతనిలో కామాగ్నిని రగిల్చాయి. "సరే! నువ్వు ఇంతగా ప్రాధేయపడుతున్నావు. నీకు కావలసిన సరుకులు ఇస్తాను. సొమ్ము తిరిగి ఇవ్వనవసరం లేదు. కాని నువ్వు నన్ను తృప్తి పరచాలి" అని తన

దుష్టభావాన్ని వ్యక్తం చేసాడు. ఈ మాటలు విన్న లోయీకి భూమి పరిభ్రమిస్తున్నట్లు అయింది. స్థాణువులా అయింది. హృదయ స్పందన ఆగినట్లైంది. తులసీ సేఠ్ "ఏమమ్మా! ఏదో ఒకటి తేల్చిచెప్పు. నేను కొట్టు మూయాలి" అన్నాడు. ఆ మాటలు విని లోయీ మనసు బహిర్ముఖమైంది. ఏం చేయాలి? పవిత్ర శీలాన్ని కోల్పోవటమా? లేక ఇంటికి వచ్చిన అతిథి మహాత్ములకు ఆతిధ్యం ఇవ్వకుండా పంపి వేయటమా? ఆమెలో తీవ్ర ఘర్షణ రేగింది. ఒకవైపు తులసీ సేఠ్ తొందర పెట్టసాగాడు.

ఏది ఏమైనా మహాత్ములకు ఆతిధ్యమివ్వటమే ప్రధాన కర్తవ్యంగా భావించి ఆమె "నేను మీ కోరిక తీరుస్తాను. కానీ ఒక్క షరతు. నేను శీలాన్ని పోగొట్టుకుని ఇంటికి వచ్చిన మహాపురుషులకు ఆతిధ్యం ఇవ్వలేను. మీరు సరుకులు ఇవ్వండి. వాటిని తీసుకొని వెళ్ళి వంట చేసి వారికి వడ్డించి వెంటనే వచ్చి మీ కోరిక తీరుస్తాను" అంది. తులసీశేఠ్ అంగీకరించి సరుకులు ఇచ్చాడు. లోయీ వాటిని తీసుకుని వెళ్ళి వంట తయారుచేసింది. భార్య భర్తలు ఇరువురూ మహాత్ములకు వడ్డించి వారిని తృప్తి పరచారు. ఆ మహాత్ములకు పాదసేవ చేసారు. వారు నిదురించిన తరువాత మహాత్ముల సేవా భాగ్యము లభించి నందుకు కబీర్ హృదయం ఆనందంతో నిండిపోయింది. "లోయీ! ఇంతమంది సంత్ మహాత్ములకు ఆతిధ్యం ఇచ్చే భాగ్యాన్ని భగవానుడు మనకు ప్రసాదించటం ఇది మన జీవితంలో మరువలేని, మరపురాని సంఘటన" అన్నాడు కబీర్‌దాస్. లోయీ భర్త వైపు చూసింది. ఆమె కళ్ళు కన్నీటితో నిండి ఉన్నాయి. "లోయీ! ఏమిటా కన్నీరు? నాకు తెలుసు. అవి కన్నీళ్ళు కాదు ఆనంద భాష్పాలు" అన్నాడు కబీర్‌దాస్.

ఈ మాటవిని లోయీ భోరుమని విలపించింది. కారణం ఏమిటో చెప్పమని అడిగాడు కబీర్‌దాస్. జరిగినదంతా పూస గుచ్చినట్లు భర్తతో చెప్పింది లోయీ. తనలాంటి దుర్మార్గురాలైన స్త్రీ చరిత్రలోనే కనిపించదని దుఃఖించసాగింది.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL